ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 12.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 262 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



రెండో టీ20లో భారత్ ఓటమి 8



నిజామాబాద్ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

తొలి దశ 'కాంగ్రెస్'దే

ఉపాధి కోసం నగరాలు, పట్టణాలలో ఉంటున్న ఓటర్లు స్వస్థలాలకు చేరుకుని ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షించారు. ఒంటిగంట వరకు క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం అయ్యింది. ఫలితాలలో కాంగ్రెస్ మద్దతుదారుల పైచేయిగా కనిపించింది. బీఆర్ఎస్ మద్దతుదారులు రెండో స్థానంలో కొనసాగారు.

మెజారిటీ స్థానాలలో గెలుపు.. కాంగ్రెస్ 2,296, బీఆర్ఎస్ 1,156, బీజేపీ 186

- 524 స్థానాలలో స్వతంత్రుల విజయదుంధుభి
- రాత్రి 11 వరకు ఇదీ ఫలితాల తీరు
- రెండో స్థానానికే బీఆర్ఎస్ పరిమితం
- చనిపోయిన వ్యక్తిని గెలిపించిన ఓటర్లు
- పలువురు ఎమ్మెల్యేలకు స్వగ్రామాలలో షాక్
- 95 యేండ్ల వయసులో మాజీ మంత్రి తండ్రి గెలుపు
- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- పోలీసుల కట్టుదిట్టమైన భద్రత
- పకడ్బందీగా అధికారుల పర్యవేక్షణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 11: తెలంగాణవ్యాప్తంగా తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా గురువారం ముగిసింది. 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు, 27,678 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. 12,960 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ 2,296, స్థానాలలో గెలుపొందగా బీఆర్ఎస్ 1156 , బీజేపీ 186 , ఇతరులు 524 స్థానాలలో విజయం సాధించారు. వార్డు మెంబర్లలో కాంగ్రెస్ 11,230 స్థానాలలో గెలుపొందగా బీఆర్ఎస్ 5000, బీజేపీ 2000, ఇతరలు 7500 స్థానాలలో విజయ దుందుభి మోగించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. స్వతంత్రంగా గెలిచిన గెలిచిన కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు అన్ని చోట్ల ఓటర్లు బారులు తీరారు. చలినూ చంటి పిల్లలతో కలిసి


...:: మిగతా 2లో

'సమరంలో' కుంగుతున్న కమలం

8 మంది ఎంపీలు-8 మంది ఎమ్మెల్యేలు

ప్రజా సమస్యల నిలదీతపై 'మౌనవ్రతం'

- ఎదగాల్సిన చోట కుంగిపోతున్న బీజేపీ
- సీఎం రేవంత్ కు భయపడుతున్నారనే విమర్శ
- బాధ్యతను విస్మరిస్తున్న ప్రజా ప్రతినిధులు
- రాష్ట్ర ప్రయోజనాలనూ పట్టించుకోని వైనం
- కేంద్రం నుంచి సాధించాల్సిన చోటా ఇదే తీరు
- అంతర్గతంగానూ కొనసాగుతున్న వివాదాలు!
- రాష్ట్ర నేతల తీరుపై అధిష్టాన నేతలు సీరియస్



చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 11: తెలంగాణ రాజకీయాలలో బీజేపీ సమీకరణాలు కొత్త దిశగా వెళ్లాల్సిన సమయంలో, పార్టీ వైఖరి ప్రజల్లో తీవ్ర నిరాశను, అసహనాన్ని రేకెత్తిస్తోంది. రాష్ట్రంలో అరుదైన రాజకీయ పరిస్థితిగా, బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నా, ప్రజా సమస్యలపై పార్టీ పోరాటం పూర్తిగా కనుమరుగైందనే విమర్శలు మరింత వేడెక్కుతున్నాయి. తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాల్సిన బీజేపీ, అసలు ప్రతిపక్షమే కాకుండా, 'మౌనపక్షం'గానే మారిపోయిందన్న అభిప్రాయం కేడర్ నుంచి ప్రజల వరకు వినిపిస్తోంది. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, సంస్థలు, అభివృద్ధి పథకాలు, ప్రతి అంశంపై బీజేపీ ఎంపీలు క్రియాశీలకంగా ప్రదర్శించాల్సిన సమయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా మారింది. ప్రజలు ఓపెన్‌గా ప్రశ్నిస్తున్నారు. 'కేంద్రంలో బీజేపీ పదేండ్లు అధికారంలో ఉంది, మూడో పర్యాయం కూడా అధికారంలోకి వచ్చింది. తెలంగాణకు ఏం తెచ్చారు? ఎక్కడి కోసం పోరాడారు?' అని. రాష్ట్రం ప్రయోజనాల కోసం ఒత్తిడి చేయడానికి, ప్రాజెక్టులు సాధించడానికి ఎంపీలు చూపాల్సిన పట్టుదల, ధైర్యం, దూకుడు , ఏదీ కనిపించడం లేదనేది పెరుగుతున్న అసంతృప్తి.

ప్రజలలో గాఢమైన అనుమానాలు

అంతేకాదు, అసెంబ్లీలో కూడా బీజేపీ ఎమ్మెల్యేల ప్రవర్తన పెద్ద చర్చనీయాంశంగా మారింది. మూడో పార్టీ అయినప్పటికీ, ప్రతిపక్షం హోదా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం, ప్రశ్నలు, ఆక్షేపణలు, పోరాటం, ఏ అంశంలోనూ బీజేపీ ఎమ్మెల్యేలు

...:: మిగతా 2లో



పార్లమెంట్‌లో ఈ -సిగరెట్ దుమారం

పార్లమెంట్ సమావేశాల్లో గురువారం ఈ-సిగరెట్ వ్యవహారం దుమారం రేపింది. లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఒకరు ఈ-సిగరెట్ తాగారని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు.

7



అమెరికా బాటలో మెక్సికో..

భారత్‌పై అమెరికా భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ట్రంప్ నిర్ణయంతో భారత్-అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇక ఇప్పుడు తాజాగా అమెరికా బాటలోనే మరో దేశం కూడా ఇండియాకి షాకిచ్చింది.

7



'సర్' గడువును పెంచిన ఈసీఐ

- ఆరు రాష్ట్రాలు, యూటీలకు మాత్రమే
- సవరించిన షెడ్యూల్ కూడా విడుదల
- రాజస్థాన్, బెంగాల్ లో ముగిసిన గడువు
- త్వరలోనే ముసాయిదా జాబితాల ప్రచురణ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 11: కేంద్ర ఎన్నికల కమిషన్ మరో కీలక నిర్ణయం తీసుకుంది.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును పెంచుతూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువు పెంపు ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తిస్తుందని వివరించింది. తమిళనాడు, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సహా అండమాన్ అండ్ నికోబార్ దీవులకు చెందిన ప్రధాన ఎన్నికల అధికారులు కోరినందునే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. మారిన షెడ్యూల్‌ను కూడా ఈసీ

...:: మిగతా 2లో

ఇక చాలు పోలీసులకు లొంగిపొండి

- ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టు ఆదేశం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐజీకి ఎదురుదెబ్బ
- విచారణకు సహకరించడం లేదన్న ప్రభుత్వం
- అందుకు అఫిడవిట్ సమర్పించామన్న పిటిషనర్
- తదుపరి విచారణ 19కి వాయిదా వేసిన ధర్మాసనం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 11: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. శుక్రవారం నాడు ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారి ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ప్రభాకర్‌రావు కస్టోడియల్ దర్యాప్తుకు అనుమతి ఇచ్చింది. ఆయనకు భౌతికంగా ఎలాంటి హాని లేకుండా చూడాలని సూచించింది. తదుపరి విచారణ ఈనెల 19కి వాయిదా వేసింది. పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పించి సిట్ విచారణకు సహకరించాలని న్యాయస్థానం చెప్పినా ఆయన సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఐక్లౌడ్ పాస్‌వర్డ్‌లను రీసెట్ చేసి అందులోని వివరాలను దర్యాప్తు అధికారులకు చూపించాలని కోర్టు ఆయనకు చెప్పినప్పటికీ, కేవలం రెండు పాస్‌వర్డ్‌లను మాత్రమే రీసెట్ చేశారని తెలిపారు. అందులో రీసెట్ చేసిన రెండు అకౌంట్లలోని సమాచారాన్ని ముందే డిలీట్ చేశారని చెప్పారు.

సహకరిస్తున్నామని అఫిడవిట్

కోర్టు పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పించడం వల్ల దర్యాప్తునకు ఏ మాత్రం సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని, దీనిపై మీరేమంటారని ప్రభాకర్‌రావు తరఫున న్యాయవాది రంజిత్ కుమార్‌ను

...:: మిగతా 2లో



అఫ్గానిస్తాన్‌పై దాడి.. యుద్ధమే

అఫ్గానిస్థాన్ పై పాక్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులను యుద్ధ చర్యలుగా అభివర్ణించింది. ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు, క్రికెటర్లు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేసింది.

7



నాణేలు, వారసత్వ అధ్యయనాల్లో అగ్రభాగంలో నిలవాలి

...:: 3లో

- నాణేల పరంపరకు దక్షిణ భారతం ప్రసిద్ధి
- న్యూమిస్మాటిక్స్ జాతీయ సెమినార్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రజా సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

తెలంగాణా జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం



ప్రజా సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలంగాణా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, బ్రిడ్జి నిర్మాణం, హమాలీలు, కుమ్మరి వృత్తిదారులు, స్లమ్ ప్రాంతాల మౌలిక సదుపాయాల లోపం వంటి అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని కవిత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మలక్‌పేట్, యాకుత్‌పురా, చార్మినార్ ప్రాంతాల్లో కవిత పర్యటించారు.

...:: 2లో



అమిత్ షా ఒత్తిడిలో ఉన్నారు..

పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా లోక్‌సభలో బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే.

7

ఇక చాలు పోలీసులకు లొంగిపోండి

మొదటిపేజీ తరువాయి

జస్టిస్ బీవీ నాగరత్న ప్రశ్నించారు. అయితే, పిటిషనర్ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్న పలు విషయాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసినట్లు ఆయన చెప్పారు. అఫిడవిట్ ను మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు దాఖలు చేయడంతో దానిని పరిశీలించలేదని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా చెప్పారు. అభిప్రాయం చెప్పడానికి సమయం ఇవ్వాలని కోరడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను 19వ తేదీకి వాయిదా వేశారు. ఇరు వైపులా వాదనలు పరిశీలించిన ధర్మాసనం చివరగా సిట్ అధికారి ఎదుట ప్రభాకర్‌రావు లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. వారం పాటు జరిగే కస్టోడియల్ విచారణలో ఇంటి నుంచి భోజనం, ఆరోగ్యానికి సంబంధించిన మందులు తీసుకునేందుకు అనుమతి ఇచ్చింది.

నేతల వాంగ్మూలాల సేకరణ: పలు రాజకీయ పార్టీల అగ్రనాయకులను లక్ష్యంగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే అంశం మొదట తీవ్ర కలకలం రేపింది. ఈ నేపథ్యంలో నిందితులైన పోలీసు ఉన్నతాధికారులపై కేసులు నమోదు చేసింది. వారిలో ప్రభాకర్‌రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్న, ప్రణీత్ రావు ఉన్నారు. అప్పుడు రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ప్రభాకర్‌రావు పై ఈ కేసులో పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. కేసును సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ పోలీస్ శాఖ దర్యాప్తు మొదలు పెట్టింది. అందులో భాగంగానే ఫోన్‌ట్యాప్ అయిన నేతలు ఈటల రాజేందర్, మహేశ్ కుమార్ గౌడ్, బండి సంజయ్ వంటి నాయకులను పిలిచి వాంగ్మూలం తీసుకుంది. ప్రభాకర్ రావు, మునుపటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి మేలు చేకూర్చేందుకు రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, న్యాయమూర్తుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారని పోలీసులు చెబుతున్నారు.

‘సర్’ గడువును పెంచిన ఈసీఐ

మొదటిపేజీ తరువాయి



ప్రకటించింది. నిజానికి ప్రాంతాలలో డిసెంబర్ 11 నాటికి ‘సర్’ ప్రక్రియ ముగియాలి. కానీ ఇది సాధ్యం కాలేదు. అందుకే గడువును పెంచుతూ ఈసీ నిర్ణయం తీసుకుంది. తమిళనాడు, గుజరాత్‌లో గడువును ఈ నెల 14 వరకు పొడిగించారు. 19న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబార్ దీవులకు 18 వరకు గడువు పొడిగించారు. జాబితాను 23న ప్రచురిస్తారు. ఉత్తరప్రదేశ్‌లో 26 వరకు పొడిగించారు. ముసాయిదా ఓటరు జాబితాను ఈ నెల 31న ప్రచురిస్తారు. గోవా, పుదుచ్చేరి, లక్షద్వీప్, రాజస్థాన్, బెంగాల్ లో ‘సర్’ గడువు గురువారంతో ముగిసింది. ముసాయిదా జాబితాను 16న ప్రచురించనున్నారు. కాగా, కేరళ షెడ్యూల్‌ను గతంలోనే సవరించారు. ఆ రాష్ట్రానికి చెందిన ఎన్యుమరేషన్ వ్యవధి 18న ముగుస్తుంది. జాబితా డిసెంబర్ 23న ప్రచురించనున్నారు.

కేసీఆర్‌పై ద్వేషం వెదజల్లుతున్న రేవంత్

- **ఓయూ పర్యటనలో సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్ ఫైర్**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 11: ఉస్మానియా యూనివర్సిటీకి కన్నతల్లి లాంటిదని, తాను అక్కడే చదువుకుని విద్యార్థి నాయకుడిగా పనిచేశానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ గుర్తుచేసుకున్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన నిర్వహించిన ప్రెస్ మీట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓయూ పర్యటనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిన్న సీఎం ఓయూ వెళ్తే నాలుగు మంచి మాటలు మాట్లాడతారని అనుకున్నామని, కానీ ఆయన తీరు మారలేదని శ్రవణ్ ధ్వజమెత్తారు. సీఎం ప్రసంగం విషపూరితమైనదని విమర్శించారు. ప్రతి వేదికను కేసీఆర్‌పై ద్వేషం వెదజల్లేందుకు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. నల్లమల అడవులతో సీఎంకు ఎలాంటి సంబంధం లేదని, పుట్టిన కొండారెడ్డి పల్లి నుంచి నల్లమలకు గంటన్నర ప్రయాణమని, మొగిలీలా క్రూర జంతువులతో ఆడుకున్నాడేమో అని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమంపై తుపాకి ఎక్కుపెట్టిన రేవంత్ ఓయూలో ఉద్యమం గురించి మాట్లాడటం సిగ్గుచేటని, యాదయ్య, వేణుగోపాల్ రెడ్డి లాంటి అమరులు తెలంగాణ ద్రోహుల వల్లే ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. కేసీఆర్ స్థాపించిన గురుకులాలను ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని, 2.5 లక్షల మందికి నాణ్యత విద్య ఇస్తూ మిగతా 15 లక్షల మందిని విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లపై బీసీల గొంతు కోసి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం డ్రామా అని అన్నారు. గ్లోబల్ సమిట్ లో ఇంగ్లీష్ మాట్లాడగలరు కానీ బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా చదివే ఓయూలో ఇంగ్లీష్ అవసరం లేదంటారని, తనకు రాని ఇంగ్లీష్ ఇతరులకు రాకూడదనేది రేవంత్ విధానమని ఎద్దేవా చేశారు. 3 ట్రిలియన్ ఎకానమీ మూడు రూపాయల మైండ్ సెట్ తో సాధ్యమా అని, 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తూనే ఇంగ్లీష్ వద్దంటున్నారని అన్నారు. రేవంత్ హయాంలో తెలంగాణ రైజింగ్ కాదు రావేజింగ్ అని, గ్లోబల్ సమిట్ లో ధరించిన బట్టలు చూసి ఎవరైనా పెట్టుబడులు పెడతారా, చిరంజీవి కంటే నయం బట్టలు వేసుకొచ్చారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌పై విషం చల్లే మాటలు మానేస్తే రేవంత్‌కే మంచిదని సూచించారు.

విత్తన బిల్లు ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాం

- **కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు పెద్దపీట**
- **ట్రయల్స్ లేకుండానే విదేశీ విత్తనాలు దేశంలోకి వచ్చే ప్రమాదం**
- **రైతు ప్రయోజనాలే పునాదిగా విత్తన బిల్లు ఉండాలి**
- **భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 11: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న విత్తన బిల్లు డ్రాఫ్ట్‌ను భారత రాష్ట్ర సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. కేంద్రం ప్రతిపాదిస్తున్న ఈ విత్తన బిల్లు వలన రైతన్నలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఈ బిల్లును పూర్తిగా ఆపివేసి, రైతన్నలతో, రైతు సంఘాలతో, నిపుణులతో, రాజకీయ పార్టీలతో చర్చ చేసిన అనంతరం ఈ బిల్లుఅంశంపై ముందుకు పోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఈ బిల్లులో నకిలీ విత్తనాలను కట్టడి చేసే అంశంపై స్పష్టత లేదని, నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతన్నలకు నిర్దిష్ట సమయంలోనే నష్టపరిహారం అందించే అంశంపై గ్యారంటీ లేదని కేటీఆర్ అన్నారు. దీంతో పాటు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా విత్తనాల ధరలను నిర్ణయించే విధంగా ఈ బిల్లులో నిబంధనలు ఉన్నాయని, గతంలా విత్తనాల ధరల నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకుండా పోతుందని కేటీఆర్ అన్నారు. నకిలీ విత్తనాలకు సంబంధించిన అంశంలో జాతీయ స్థాయిలో ఆయా కంపెనీలను బ్లాక్‌లిస్ట్ చేయడం, భారీ పెనాల్టీలు, కఠిన జైలు శిక్ష వంటి అంశాలకు ఇందులో పెద్దగా ఆస్కారం లేదని కేటీఆర్ అన్నారు. దీంతో పాటు సాంప్రదాయంగా రైతన్నలే విత్తనాలను తయారు చేసుకొని పండించుకునే వ్యవసాయ సాంప్రదాయాలు ఇప్పటికీ అనేక చోట్ల ఉన్నాయని, అయితే ఇలాంటి రైతన్నల సమూహానికి ఈ బిల్లులో ఏమాత్రం రక్షణ లేకుండా పోయిందని అన్నారు. వీటితో పాటు విదేశాల నుంచి నేరుగా ఆయా కంపెనీలు ఎలాంటి విత్తన ట్రయల్స్ లేకుండానే దేశంలో తమ విత్తనాలను అమ్ముకునే విధంగా సులభమైన నిబంధనలు ఉన్నాయని, వీటి వలన దేశీయ విత్తన భద్రత, విత్తన సార్వభౌమత్వం ప్రమాదంలో పడుతుందని కేటీఆర్ అన్నారు. ఈ అంశానికి సంబంధించి రాష్ట్రాలకు, రాష్ట్రంలోని వ్యవసాయ యూనివర్సిటీలకు ఎలాంటి ప్రాధాన్యత లేకుండా చేశారని అన్నారు. దీంతో పాటు ఈ మొత్తం బిల్లు రాష్ట్రాల పరిధిలోని వ్యవసాయ రంగంలో కీలకమైన విత్తనాల అంశంపై కేంద్ర ఆధిపత్యానికి దారి తీస్తుందని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రాలు సొంత చట్టాలు చేసుకుని ముందుకు పోయే అంశాన్ని బలహీనం చేస్తుందని కేటీఆర్ అన్నారు. అందుకే రైతే కేంద్రంగా ఉండే విత్తన బిల్లును రూపకల్పన చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, ఈ అంశంలో ఈజ్ ఆఫ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు ఆధిపత్యం అప్పగించే ప్రయత్నాలను పక్కన పెట్టాలని కేటీఆర్... తమ పార్టీ తరఫున ప్రతిపాదించిన సవరణల్లో పేర్కొన్నారు. దీతో పాటు విత్తన సార్వభౌమత్వం, దేశీయ బయోసేఫ్టీ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్రాల అంశంపై కేంద్రానికి ఆధిపత్యం ఇవ్వకుండా రూపకల్పన చేయాలని ఈ బిల్లుకు సవరణలు ప్రతిపాదించారు. దీంతో పాటు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతన్నలకు ఎకరానికి పండే పంటలో గరిష్ఠ ఉత్పత్తి మేరకు నష్టపరిహారం నిర్దిష్ట సమయంలో అందేలా కఠిన నిబంధనలు ఇందులో ఉంచాలని సూచించారు.

తొలి దశ ‘కాంగ్రెస్’దే

మొదటిపేజీ తరువాయి

పోలింగ్ కేంద్రానికి వచ్చారు. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు అంబులెన్స్‌లో వచ్చారు. గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 84.28 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.88 శాతం, అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడం జిల్లా 71.79 శాతంగా పోలింగ్ నమోదైంది.

పట్టణాల నుంచి పల్లెలకు

ఉపాధి కోసం నగరాలు, పట్టణాలలో ఉంటున్న ఓటర్లు స్వస్థలాలకు చేరుకుని ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షించారు. ఒంటిగంట వరకు క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం అయ్యింది. ఫలితాలలో కాంగ్రెస్ మద్దతుదారుల పైచేయిగా కనిపిస్తున్నది. బీఆర్ఎస్ మద్దతుదారులు రెండో స్థానంలో కొనసాగారు. ఆ వెను వెంటనే ఉప సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

పాపం ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు

కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించారు. పలువురు ఎమ్మెల్యేల స్వగ్రామాలలో ప్రజలు వారికి జలక్ ఇచ్చారు. షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ స్వగ్రామం వీర్లపల్లిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మద్దతు దారుడు ఘన విజయం సాధించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్వగ్రామం రంగారెడ్డి గూడెంలోనూ బీజేపీ మద్దతుదారు గెలుపొందారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు స్వగ్రామం చినబండిరేవులో గులాబీ మద్దతుదారు గెలుపొందారు. ఇటు మహబూబాబాద్ మండలం సోమ్లా తండాలో ఎమ్మెల్యే మురళీ నాయక్ వదిన ఓడిపోయింది. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఇస్లావత్ సుజాత విజయం సాధించారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి సొంత ఊరు సూర్యాపేట రూరల్ బాలెంలలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు.



సిత్ర, విచిత్రాలు

మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి నల్గొండ జిల్లా నాగారం సర్పంచ్‌గా 95 యేండ్ల వయసులో విజయం సాధించారు. తద్వారా రాష్ట్ర చరిత్రలో అత్యధిక వయస్కుడైన సర్పంచ్‌గా రామచంద్రారెడ్డి రికార్డు నెలకొల్పారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లెలో తల్లి, కుమార్తె మధ్య పోటీ నెలకొంది. తల్లి శివరాత్రి గంగవ్వను బీఆర్ఎస్ బలపరచగా, కుమార్తె సుమలతను కాంగ్రెస్ బలపరిచింది. ఓట్ల లెక్కింపులో తల్లి గంగవ్వపై కుమార్తె సుమలత 91 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మహబూబాబాద్ మండలం నడివాడ సర్పంచ్ ఎన్నికలలో పోటీకి నామినేషన్ వేసిన బుచ్చిరెడ్డి ఈ నెల తొమ్మిదిన గుండెపోటుతో మరణించారు. బుచ్చిరెడ్డికి 165 ఓట్లు వచ్చాయి. అభ్యర్థి మరణించినా ఓటు వేయడం గమనార్హం. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌అటవీ ప్రాంతంలో రెండు గ్రామాల మధ్య ఎత్తైన గుట్ట ఉండటంతో కొత్త గద్పూర్ గ్రామానికి చెందిన దాదాపు 50 మంది ఓటర్లు 56 కిలోమీటర్లు ప్రత్యేక బస్సులో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



చనిపోయిన వ్యక్తి సర్పంచ్‌గా గెలుపు

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణాలో ఆశ్చర్యకర ఘటన చోటుచేసుకుంది. పోలింగ్‌కు రెండు రోజుల ముందు గుండెపోటుతో మరణించిన సర్పంచ్ అభ్యర్థి చెర్ల మురళి-బీఆర్ఎస్ (50) ఫలితాలలో విజేతగా నిలిచారు. మురళి 700 కంటే ఎక్కువ ఓట్లు సాధించగా, సమీప అభ్యర్థికి 378 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అభ్యర్థి మరణించినప్పటికీ, బ్యాలెట్ లో పేరు మార్పు చేయలేకపోవడంతో ఓటర్లు ఆయనకే ఓటు వేశారు. విజేత భౌతికంగా లేనందున సర్పంచ్ పదవికి సంబంధించిన తదుపరి ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశామని, తదుపరి చట్టపర చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ అసాధారణ పరిణామం మీద గ్రామమంతా ఇప్పుడు ఉత్కంఠతో ఎదురు చూస్తోంది.



ఫామ్‌హౌస్‌లో బర్త్‌డే పార్టీ.. పోలీసుల రైడ్

- **పోలీసుల అదుపులో దువ్వాడ శ్రీనివాస్, మాధురి?**
- **మద్యం బాటిళ్లు స్వాధీనం**

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 11: మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో ఎలాంటి అనుమతి లేకుండా ఫామ్ హౌస్‌లో బర్త్‌డే పార్టీ జరుగుతోందనే సమాచారంతో రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడులు నిర్వహించినట్టు తెలుస్తోంది. వైఎస్ఆర్‌సీపీ పార్టీకి చెందిన నేత దువ్వాడ శ్రీనివాస్, దువ్వాడ మాధురి ఈ పార్టీ ఇచ్చినట్టు సమాచారం. వారిరువురు మద్యం సేవించి బర్త్ డే పార్టీ నిర్వహించుకున్నట్టు తెలుస్తోంది. ఈ పార్టీలు పలువురు ప్రముఖులు, వైసీపీ నాయకులు ఉన్నట్టు కూడా స్థానికులిచ్చిన సమాచారం. డిసెంబర్ 12వ తేదీన మాధురి బర్త్ డే కోసమే ఈ పార్టీ నిర్వహించినట్టు తెలుస్తోంది. ఈ దాడులకు సంబంధించి పోలీసులు వివరాలను ఇంకా వెల్లడించలేదు.

‘సమరంలో’ కుంగుతున్న కమలం

మొదటిపేజీ తరువాయి



చురుకుగా వ్యవహరించడం లేదు. ‘అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలున్నారు అంటే ఉన్నారోలేదో కూడా తెలియనంత స్థితి. ప్రతిపక్షం అంటే ప్రభుత్వాన్ని నిలదీయడం. కానీ ఆ బాధ్యతను బీజేపీ పూర్తిగా విస్మరించినట్లు, అసెంబ్లీ రికార్డులు చెబుతున్నాయనే’ విమర్శలు ఇటు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరో ఆసక్తికరమైన విమర్శ రాజకీయవర్గాలలో గట్టిగానే వినిపిస్తోంది. బీజేపీ నేతలు అసలు అధికార పార్టీ కాంగ్రెస్‌ను విమర్శించేందుకు వెనుకాడుతుండగా, ఒకప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌పై మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇది యాదృచ్ఛికమా? లేక వ్యూహమా? లేక మరే రాజకీయ ఆసక్తులు అటు ఉన్నాయా? అనే ప్రశ్నలు బలపడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై నోరు విప్పడానికి ధైర్యం లేకపోవడం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేరుగా ప్రశ్నించకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలపై చురుకుదనం చూపకపోవడం, ఇన్ని అంశాలు ప్రజలలో గాఢమైన అనుమానాలను సృష్టిస్తున్నాయి.

ముందుకు సాగకపోతే ప్రజలు ఎలా విశ్వసిస్తారు?

ఈ మౌనాన్ని మరింత బలంగా నిర్ధారించేలా పార్టీ అంతర్గత వర్గాలలో మరో విస్ఫోటక ఆరోపణ వినిపిస్తోంది. బీజేపీకి చెందిన కొందరు అగ్ర నాయకులు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉన్నారనే అన్నది పార్టీ లోపలే పెద్ద చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఆరోపణలు వచ్చిన క్షణం నుంచే, ఇటు కాషాయ శిబిరంలో గందరగోళం, అసహనం, అసంతృప్తి పెరిగిపోయినట్లు తెలిసింది. ‘గెలవలేని, ఎదగలేని భయంతోనే బీజేపీ నేతలు సైలెంటయ్యారా? లేక ఇతర రాజకీయ లాభనష్టాల కోసం ప్రభుత్వంతో సమన్వయం పెంచుకుంటున్నారా?’ అన్న సందేహం కేడర్‌ను వేధిస్తోంది. ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది ఎమ్మెల్యేలు ఉన్న రాష్ట్రంలో బీజేపీ నుండి ప్రజలు ఆశించిన నాయకత్వం ఏ రూపంలోనూ కనిపించకపోవడం, పార్టీపై ప్రజాభిప్రాయాన్ని ప్రతికూలంగా మార్చుతోంది. ‘ఇంత బలం ఉంటే బీజేపీ తెలంగాణలో ప్రత్యామ్నాయం కావచ్చు కానీ, నాయకులే ముందుకు సాగకపోతే ప్రజలు ఎలా విశ్వసిస్తారు?’ అన్న ప్రశ్నలు బహిరంగ చర్చలకు దారితీస్తున్నాయి.

భవిష్యత్తు మరింత అస్థిరంగా

ఈ పరిస్థితులన్నీ కేంద్ర పార్టీలోనూ తీవ్ర అసంతృప్తి పెంచాయి. తెలంగాణ బీజేపీ ఎంపీలపై ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర అగ్ర నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, రాష్ట్ర నేతలతో నేరుగా అసంతృప్తిని పంచుకున్నారని పార్టీ వర్గాలలో చర్చ జరుగుతోంది. తెలంగాణలో పార్టీ విస్తరణకు వచ్చిన అవకాశాన్ని వృథా చేశారని, బీజేపీ ప్రతిభను చూపాల్సిన సమయంలోనే నిష్క్రియత ప్రదర్శించిందని కేంద్రం తీవ్రంగా భావిస్తున్నట్లు సమాచారం. మొత్తంగా చూస్తే తెలంగాణలో బీజేపీ ప్రస్తుతం ఒక కీలక దశలో నిలబడి ఉంది. బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగాల్సిన సమయంలో, నాయకుల మౌనం, నిస్సహాయత, దిశాహీనత వల్ల పార్టీ అవకాశాలను కోల్పోతుందనే విమర్శలు ఉన్నాయి. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తి, కేడర్‌లో పుట్టిన ఆగ్రహం, కేంద్రం నుంచి వస్తున్న హెచ్చరికలు, ఇవన్నీ కలిపి చూస్తే తెలంగాణ బీజేపీ భవిష్యత్తు ఇప్పుడు మరింత అస్థిరంగా కనిపిస్తోంది.

ప్రజా సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- **తెలంగాణా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 11: ప్రజా సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలంగాణా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, బ్రిడ్జి నిర్మాణం, హమాలీలు, కుమ్మరి వృత్తిదారులు, స్లమ్ ప్రాంతాల మౌలిక సదుపాయాల లోపం వంటి అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని కవిత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మలక్‌పేట్, యాకుత్‌పురా, చార్మినార్ ప్రాంతాల్లో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, హమాలీలు, వ్యాపారులు, కుమ్మరి వృత్తిదారులు, స్లమ్ ప్రాంతాల ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, డ్రైనేజీ, రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం, ప్రజలకు వినియోగ సదుపాయాలు, మహిళా హామీలు వంటి అంశాలపై ఆమె ప్రభుత్వం తీసుకుంటున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు. మూసారాంబాగ్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించిన కవిత మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని ఆగ్రహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారంగా చదువు కొనసాగిస్తున్న వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగాలు పొందే అవకాశాలు కోల్పోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులే ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసే సమయం వచ్చిందని ఆమె పిలుపునిచ్చారు. తదుపరి మలక్‌పేట్ గంజ్‌ను సందర్శించిన ఆమె హమాలీలు, వ్యాపారులతో మాట్లాడి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. హమాలీల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని, జీహెచ్ఎంసీ శానిటేషన్, లైట్లు, డ్రైనేజీపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి అసంపూర్తి పనులను పరిశీలించిన కవిత, 2020లో ప్రారంభమైన ఈ బ్రిడ్జి ఐదేళ్లుగా ముందుకు కదల్లేదని మండిపడ్డారు. నగరంలోని అనేక బ్రిడ్జిలు పనులు పూర్తికాకపోవడంతో ఉప్పల్, మేడ్చల్ వంటి ప్రాంతాల్లో నెలకు 56 ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నేషనల్ హైవే, జీహెచ్ఎంసీ మధ్య కోఆర్డినేషన్ లేకపోవడమే ఆలస్యాలకు కారణమైందని, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, స్థానిక ఎమ్మెల్యే కలిసి అత్యవసర సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన స్కూటీలు, 2500 రూపాయల మహిళా భృతి, ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ వంటి హామీలన్నీ ఇంకా అమలు కాలేదని ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. యాకుత్‌పురాలోని కుమ్మరి వాడలో కుమ్మరి వృత్తిదారులతో సమావేశమైన కవిత ప్రభుత్వమే వారికి ఎలక్ట్రిక్ కుమ్మరి చక్రాలు ఉచితంగా లేదా సబ్సిడీపై ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. తదుపరి యాకుత్‌పురాలోని హనుమాన్ నగర్, ఖాజా బాగ్ కాలనీలను సందర్శించి ప్రజలతో జరిగిన సమావేశంలో కవిత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలు 40 ఏళ్లుగా ఇళ్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్నా, బీఆర్ఎస్ పదేళ్లు, కాంగ్రెస్ రెండేళ్లు ఉన్నా పరిస్థితి మారలేదని చెప్పారు. స్లమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు దాని గురించి మాట్లాడలేదని విమర్శించారు. చార్మినార్ పర్యటనలో కవిత లాల్ దర్వాజ శ్రీ సింహవాహిని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మక్కా మసీదు సందర్శించారు. లాడ్ బజార్‌లో గాజులు కొనుగోలు చేశారు.



విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఓ పక్క చంద్రబాబు ప్రకటనలు చేస్తూ మరోపక్క సర్దుబాటు పేరిట ప్రజలపై భారం మోపేందుకు సిద్ధమవ్వడం దారుణం. సర్దుబాటు పేరుతో ఇప్పటికే రూ.15,000 కోట్లు వసూలు చేసి ప్రజలను ఇబ్బందులు పెట్టారు. ఇప్పుడు మళ్లీ మరో రూ.15,651 కోట్ల సర్దుబాటు ఛార్జీలకు ఏపీఈఆర్సీ రంగం సిద్ధం చేసింది.

- ఏపీసీసీ చీఫ్ షర్మిల

హైదరాబాద్‌కు మెస్సీ...

రాహుల్, ప్రియాంకకు సీఎం ఆహ్వానం




ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 11: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరారు. హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంటులో సీఎం మీడియాతో ముచ్చటించారు. ఈనెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్ వస్తున్నారని తెలిపారు. ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెస్సీ హాజరవుతున్నారని, ముఖ్యమంత్రిగా ఉన్నాను కాబట్టి తనను కూడా ఒక అతిథిగా పిలిచినట్లు చెప్పారు. తాను కూడా ఒక అతిథిగానే ఆ కార్యక్రమానికి హాజరవనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక ప్రముఖ క్రీడాకారుడు హైదరాబాద్‌కు వస్తున్నారు కాబట్టి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తున్నామని తెలిపారు. మెస్సీ కార్యక్రమానికి రావాలని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీలను కోరానని, అలాగే ఢిల్లీలో కలిసిన అందరినీ ఆ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ బిజీబిజీగా గడిపారు. ఉదయం పార్లమెంట్ లో ఏఐసీసీ అధక్షులు మల్లికార్జునఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలు, గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన అంశాలను వారి దృష్టి తీసుకెళ్లారు. గ్లోబల్ సమ్మిట్‌ను ఏ విధంగా విజయవంతం చేశామనే అంశాలపై చర్చించారు. ఆపై ఢిల్లీ పర్యటనను ముగించుకుని సీఎం హైదరాబాద్‌కు పయనమయ్యారు.

సీఎంకు ఖర్గే, ప్రియాంక అభినందనలు

తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్ ముఖచిత్రాన్ని డాక్యుమెంట్ ఆవిష్కరించిందని వారు పేర్కొన్నారు. ఢిల్లీలో మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీలను వారి నివాసాల్లో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైన తీరు, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై వారి మధ్య చర్చ కొనసాగింది. సీఎం వెంట మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు సురేశ్ షెట్కార్, మందాడి అనిల్ కుమార్, పోరిక బలరాం నాయక్, డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ ఉన్నారు.

ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ కర్టెన్ రైజర్ ఆవిష్కరణ

- పర్యాటక భవన్లో బెలూన్ ఎగురవేత
- డిసెంబర్ 19,20,21 తేదీల్లో ఫెస్టివల్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్11: తెలంగాణ ఫిలిం డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ఫెస్టివల్ కు సంబధించిన ప్రమోషన్ ఈవెంట్స్ మొదలుపెట్టారు. ఈ ఫెస్టివల్ కర్టెన్ రైజర్ ను బుధవారం సాయంత్రం టూరిజం ప్లాజాలో టూరిజం ఎండీ వల్లూరు క్రాంతి, ఫిలీం డెవెలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక కలసి ఆవిష్కరించారు. టూరిజం భవనం పై ప్రచార బెలున్ లను కూడా ఎగురవేశారు. ఏడువందల పైగా వివిధ దేశాల నుంచి సైతం వచ్చిన సినిమాల ప్రోమోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా టూరిజం డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రపంచ వేదికగా ఎదిగిందని, యూరప్, అమెరికా వంటి దేశాల నుంచి సినిమాలు వచ్చాయని చెప్పారు. భారతదేశంతో పాటు వివిధ దేశాల నుంచి 700 కి పైగా చిత్రాలు రావడం హర్షించదగిన విషయమని అన్నారు. నూతనంగా ఫిలిం ఇండస్ట్రీలోకి వచ్చే యువతీ యువకులకు ఇదొక గొప్ప వేదిక అవుతుందనని ఆమె అన్నారు. అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ హైదరాబాద్ ఖ్యాతిని పెంచేలా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఈ చిత్రోత్సవాన్ని నిర్వహించే దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ బృందాన్ని అభినందించారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభం నుండి వారు చేసిన అవిశ్రాంత కృషిని ఆమె ప్రశంసించారు. హైదరాబాద్‌లో అడ్వాన్స్ టెక్నాలజీతో రూపొందినిసిన ప్రసాద్స్ ఐమాక్స్‌లో ఈ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైన 60 మంది చిత్రనిర్మాతలందరికీ ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ అధినేత, అంకురం దర్శకుడు ఉమా మహేశ్వర్ రావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహించి వదిలేయడం కాకుండా , తరువాత కూడా సినిమాలు పంపిన యువతతో, సినిమాలు చూసిన యువతతో ఒక అవగాహన సదస్సు నిర్వహిచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. దీని ద్వారా సినిమాపట్ల ఆసక్తిగా ఉన్నారు అనేక అంశాలపై అవగాహన పెంచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. డిసెంబర్ 19,20,21 తేదిల్లో ఈ ఫెస్టివల్ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డీ సీ డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి శీతాకాల విడిదికి పకడ్బందీ ఏర్పాట్లు

- 17 నుండి 21 వరకు రాష్ట్రపతి పర్యటన
- అధికారులతో సీఎస్ రామకృష్ణారావు సమీక్ష



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 11: శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. ఐదు రోజులపాటు రాష్ట్రంలో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై గురువారం డా.బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి విస్తృత ఏర్పాట్లు చేయాలని సి.ఎస్. ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీసు శాఖ తగు భద్రతా, ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని, వైద్య, ఆరోగ్యశాఖ వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రోడ్డు భవనాల శాఖ విభాగం అవసరమైన బారికేడింగ్‌లు, ఇతర ఏర్పాట్లు చేయాలని, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలు స్నేక్ క్యాచర్ బృందాన్ని అందుబాటులో వుంచాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ సమన్వయంతో రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని, అదేవిధంగా తేనెటీగలను పట్టుకోవానికి ముందుస్తు ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి ఈ. శ్రీధర్, అదనపు డీజీపీలు మహేష్ భగవత్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

- రూ. 750 కోట్ల విలువైన భూమి చుట్టూ ఫెన్సింగ్

ప్రతిపక్షం,సిటి బ్యూరో , డిసెంబర్ 11: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేట విలేజ్ సర్వే నంబరు 191లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా గురువారం కాపాడింది. దీని విలువ రూ. 750 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇక్కడ ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతుందని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులతో కలిసి విచారించింది. ఆక్రమణలను నిర్ధారించుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు శాశ్వత నివాసాల జోలికి వెళ్లకుండా.. మిగతా షెడ్డులను, ప్రహరీలను తొలగించి.. 10 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేసింది .

నాణేలు, వారసత్వ అధ్యయనాల్లో అగ్రభాగంలో నిలవాలి

- నాణేల పరంపరకు దక్షిణ భారతం ప్రసిద్ధి
- న్యూమిస్మ్యాటిక్స్ జాతీయ సెమినార్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్11: న్యూమిస్మ్యాటిక్స్ (నాణేల అధ్యయనం), వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగంలో ఏర్పాటుచేసిన "దక్షిణ భారతదేశ నాణేలు మరియు ఆర్థిక వ్యవస్థ"అనే అంశంపై న్యూ మిస్ మ్యాటిక్స్ సొసైటీ ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సదస్సు రెండు రోజులు జరిగే కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఒక చిచ్చరపిడుగులా కొత్త ఆలోచనలను రగిలించే వేదిక కావాలని నా ఆశ అన్నారు. వివిధ సంస్థల మధ్య సహకారం పెరగాలి, యువ పరిశోధకులు అంతరశాస్త్రీయ అధ్యయనాలపై దృష్టి పెట్టాలి, న్యూ మిస్ మ్యాటిక్స్, వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ ముందంజలో నిలవాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. వారసత్వ ఆధారిత పరిశోధనకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నాయకత్వంలో మన రాష్ట్రాన్ని శాస్త్రీయ అధ్యయనం, సంస్కృతి సంరక్షణ, జ్ఞాన ఉత్పత్తిలో కేంద్రీకృత హబ్‌గా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. దక్షిణ భారతదేశానికి ప్రపంచంలోనే అత్యంత సమృద్ధిగా నాణేల పరంపర ఉంది అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ హెరిటేజ్ డైరెక్టర్ అర్జునరావు, న్యూ మిస్ మ్యాటిక్ ఇండియా సొసైటీ చైర్మన్ డాక్టర్ డి. రాజారెడ్డి, న్యూ మిస్ మ్యాటిక్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీలు ప్రొఫెసర్ పి.ఎన్. సింగ్, ప్రొఫెసర్ బింద దత్తాత్రేయ, డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ

- జయంతి సందర్భంగా సీఎం నివాళులు..

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్11: దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఢిల్లీలోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాక్సెన్ యూనివర్సిటీలో సీఎం సందడి

- స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్లో యువతతో కిక్ ఆఫ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 11: సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ కంకోల్లోని వాక్సెన్ యూనివర్సిటీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్న ఫీఫా ప్రో సర్టిఫైడ్ ఫుట్‌బాల్ టర్ఫ్‌పై విద్యార్థుల ఘోషల మధ్య సీఎం స్వయంగా మైదానంలోకి దిగి మ్యాచ్‌ను కిక్ ఆఫ్ చేశారు. 'టీమ్ రేవంత్' మరియు విశ్వవిద్యాలయ జట్టు 'వాక్సెన్ షార్క్స్' మధ్య జరిగిన ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. కార్యక్రమం అనంతరం వాక్సెన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రవీణ్ కె. పులా, ముఖ్యమంత్రిని సత్కరించి, విద్యార్థులకు ప్రేరణనిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ విభాగాలకు చెందిన ఎగ్జిబిషన్ స్టాల్స్, వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీని సీఎం సందర్శించారు. సీఎం వెంట మంత్రి దామోదర రాజనర్సింహ కూడా ఉన్నారు.

మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్

- నేడు రైతుల ఖాతాల్లో జమ కానున్న రూ. 588 కోట్లు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్11: నేటి నుండి మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించిన మొత్తాన్ని రైతుల ఖాతాలలో జమచేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలనని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దీంతో మొత్తం 55,904 మంది రైతులు లబ్ధి పొందనున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేనప్పటికీ, రాష్ట్రంలోని మొక్కజొన్న రైతులు నష్టపోకుండా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వమే పంట సేకరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు 2.45 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న రైతుల నుండి సేకరించబడిందని వెల్లడించారు. సేకరించిన ధాన్యానికి గాను రూ. 588 కోట్లు రేపటి నుండి రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయనున్నట్టు మంత్రి తెలిపారు. కేంద్రం సహకారం లేకున్నా, రైతులను ఆదుకోవడం రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యమని, వారికి ఎలాంటి నష్టం కలగకుండా చూడటం తమ మొదటి ప్రాధాన్యమని మంత్రి చెప్పారు.

కొండా సురేఖకు నాన్ బెయిలబుల్ వారెంట్


- విచారణకు హాజరు కాకపోవడంతో కోర్టు ఆగ్రహం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 11: తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై నాంపల్లిలోని ప్రత్యేక కోర్టు గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై ఈ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అనంతరం ఈ కేసు విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 5వ తేదీకి నాంపల్లి ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ విచారణ సమయంలో మంత్రి కొండా సురేఖ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాలేదు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 5వ తేదీన వ్యక్తిగతంగా హాజరు కావాలని కొండా సురేఖను కోర్టు ఆదేశించింది.

వారెంట్ అవాస్తవం: మంత్రి సురేఖ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయినట్లు తనపై జరుగుతున్న ప్రచారంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. కొన్ని పత్రికలు, ఛానళ్లు, వెబ్ సైట్లలో తనకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవం అని ఆమె గురువారం హైదరాబాద్‌లో స్పష్టం చేశారు. ఈ కేసులో తదుపరి విచారణ.. ఫిబ్రవరి 5వ తేదీన ఉందన్నారు. ఆ రోజు జరిగే విచారణకు హాజరుకావాలని కోర్టు తనకు స్పష్టం చేసిందన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు.



అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం ఉండకూడదు

- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, డిసెంబర్ 12: స్థానికంగా చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం గాజులరామారం డివిజన్‌లోని వార్డు నం.125 పరిధిలో ఉన్న రోడమేస్త్రీ నగర్ బి కాలనీలో నెలకొన్న సీసీ రోడ్డు, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక శాసనసభ్యులు కె. పి. వివేకానంద సంబంధిత శాఖ అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్ల దుస్థితి, వర్షాకాలంలో నిల్వ ఉండే మురుగు నీరు, డ్రైనేజీ అడ్డంకుల వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను నిశితంగా పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, జిహెచ్ఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణం, డ్రైనేజ్ మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజల మౌలిక సదుపాయాలే ప్రథమ ప్రాధాన్యమని, రోడమేస్త్రీ నగర్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిష్టప్ప, స్థానికులు షేక్ ముజ్జు, షేక్ అమీర్, ఫర్జానా బేగం, షమీమ్ బేగం, షాహ్ నవాజ్, శాదూల్, మొహసిన్, పార్టీ నాయకులు కస్తూరి బాలరాజు, కమలాకర్, తెలంగాణ సాయి మక్సూద్ అలీ, ఇబ్రహీం, ఇమ్రాన్, నాగేష్, మహేష్, చెట్ల వెంకటేశ్, మద్దెల సాయిబాబా, శివ నాయక్, బాబి చౌదరి, హనుమంత్ నాయక్, లక్ష్మణ్, జునైద్, కాలనీ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఇప్పటివరకు తలెత్తిన సంక్షోభానికి ఇండిగో 'మిస్ మేనేజ్మెంట్' మాత్రమే కారణం. వారి అంతర్గత సిబ్బంది రోస్టరింగ్ వ్యవస్థలో కొంత గందరగోళం నెలకొంది. ఎఫ్డీటీఎల్ మార్గదర్శకాల ప్రకారం కొత్త నిబంధనలకు అనుగుణంగా దానిని నివారించి ఉండొచ్చు. కానీ దురదృష్టవశాత్తు అలా జరగలేదు.

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ఓపెన్ వాయిస్

'ఇండిగో' సంక్షోభం వెనుక కుట్రలు

ఇండిగో సంస్థకు సంబంధించిన విమానాలు అర్థంతరంగా ఆగిపోవడం దేశంలో తీవ్ర కలవరాన్ని కలిగించాయి.. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు విమానాశ్రయాలకు పరిమితమయ్యారు. ఉన్నట్టుండి విమానాలు ఆగిపోవడంతో ప్రయాణికులు నరకం చవి చూశారు. వాస్తవానికి విమానాలు ఆగిపోవడం మన దేశ చరిత్రలో ఇదే తొలిసారి.. ప్రకృతి విపత్తులు చోటు చేసుకున్నప్పుడు, ఇతర సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు విమానాలను నిలిపివేస్తారు. కానీ, ఎటువంటి కారణాలు లేకుండానే ఇండిగో సంస్థ విమానాలు ఆపివేయడం దేశవ్యాప్తంగా ఇబ్బందికరమైన వాతావరణాన్ని కలిగించింది. విమానాలు ఆగిపోవడం వెనక టర్కీ దేశం పాత్ర అనుమానాస్పదంగా కనిపిస్తోందని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇండిగో సంస్థకు టర్కిస్ ఎయిర్ లైన్స్ తో విస్తృతమైన కోడ్ షేర్ బాండింగ్ ఉంది. టర్కిస్ ఎయిర్లైన్స్ ను నేరుగా టర్కీ ప్రభుత్వమే నియంత్రిస్తోంది. కొన్ని సంవత్సరాలుగా భారత్, టర్కీ మధ్య అంత గొప్పగా సంబంధాలు లేవు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాకిస్తాన్ కు టర్కీ బహిరంగ మద్దతు పలికింది. దీంతో భారతీయ కంపెనీలు టర్కీని బహిష్కరించాయి. అంతేకాదు, టర్కీ అధ్యక్షుడి కుమార్తెకు ప్రయోజనం కలిగించే సెలెబి ఎయిర్ పోర్ట్ సర్వీసెస్ కాంట్రాక్టు ను భారత రద్దు చేసింది. అహ్మదాబాదులో ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురికావడానికి ముందు మన దేశంలో టర్కీ విమానాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత ప్రజలు సహజంగానే ఎయిర్ ఇండియా వైపు దృష్టిస్తారించారు. ఈ కుట్ర అనేక రకాలుగా మలుపులు తిరిగింది. పుతిన్ మనదేశంలో పర్యటిస్తున్నప్పుడే పశ్చిమ దేశాలు సరికొత్త వ్యూహాలు అవలంబించాయి. అయితే, ఈ వ్యవహారం వెనుక టర్కీ మాత్రమే కాకుండా, ఇంకా చాలా దేశాలు ఉన్నాయని తెలుస్తోంది. 2020లో ట్రంప్ భారత్ లో పర్యటిస్తున్నప్పుడు సీఏఏ వ్యతిరేక నిరసనలు ఎలా అయితే వ్యక్తమయ్యాయో, పుతిన్ భారతలో పర్యటిస్తున్నప్పుడు కూడా పశ్చిమ దేశాలు అదే విధంగా అసౌకర్యానికి గురయ్యాయి. ప్రస్తుతం మన దేశంలో పెళ్లిళ్లు, ఇతర వేడుకలు విస్తృతంగా జరుగుతూ ఉంటాయి. ఈ మార్కెట్ మొత్తాన్ని స్తంభింప చేయడానికి ఈ విధమైన కుట్రలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఈ సంక్షోభానికి ఇండిగో సంస్థలో ఉన్న అంతర్గత బలహీనతలు కూడా ఒక కారణమని తెలుస్తోంది. పౌర విమానయాన శాఖ పైలెట్ ల విశ్రాంతి సమయాన్ని పెంచింది. ఈ నిబంధనలను 2024 జనవరిలో విడుదల చేసింది. అయితే, వీటిని ఇండిగో సంస్థ మాత్రం పాటించలేదు. సొంత పైలెట్ అకాడమీ ఉన్నప్పటికీ సకాలంలో పైలెట్లను ఇండిగో సంస్థ నియమించుకోలేదు. ఇండిగో సంస్థలో గంగువాల్ కుటుంబం తమ వాటాలను నిరంతరం విక్రయించుకునే పనిలో పడింది. అందులో వాటాలను పశ్చిమ దేశాలకు చెందిన బ్యాంకులు కొనుగోలు చేశాయి. అందువల్లే ఇటీవల విమానాలను తెలివిగా నిలిపివేశాయి. ప్రభుత్వం పైలెట్ల విశ్రాంతి సమయాన్ని, రాత్రి కాలంలో ఆపరేషన్ల నియమాలను అత్యంత కఠినతరం చేసింది. దీంతో రోజుకు 2,300 విమానాలను నడిపే ఇండిగో సంస్థ మీద విపరీతమైన ఒత్తిడి పడింది. పైలెట్లు విమానాలు నడపడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, కంపెనీ కావాలనే విమానాలను నిలిపివేసిందని తెలుస్తోంది. పలువురు పైలెట్లు విజిల్ బ్లోయర్లుగా ముందుకు వచ్చి ఈ నిజాలను వెల్లడించారు. మరి దీని మీద మన కేంద్ర ప్రభుత్వ చర్యలు ఎలా ఉంటాయో చూడాలి.

హైదరాబాద్,

శుక్రవారం
12.12.2025

చట్టబద్ధ నిక్షేపణ, జాతీయ వారసత్వం

ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ యాక్ట్ (1867), డెలివరీ ఆఫ్ బుక్స్ యాక్ట్ (1954) దేశ జ్ఞాన వారసత్వాన్ని రక్షించడానికి రూపొందించబడిన పరస్పరం అనుబంధితమైన చట్టపర నిర్మాణాలు. డిజిటల్ యుగంలో, ఈ చట్టాల సూత్రాలు ఇప్పటికీ ప్రస్తుతం ఉన్నాయి, అయితే, ఇప్పుడు ఈ -ప్రచురణలు, డిజిటల్ వనరుల నిక్షేపానికి సవాళ్లు, అవకాశాలను ఎదుర్కొంటున్నాయి. అయినప్పటికీ, ఈ చారికల చట్టాలు భారతదేశం ముద్రిత, ప్రచురిత చరిత్రను శాశ్వతంగా నమోదు చేసిన చట్టపర వ్యవస్థ మూల స్తంభాలుగా మిగిలి ఉన్నాయి.



డా. కోలాహలం రామ్ కిశోర్
9849328496

భారతదేశంలో ముద్రిత, ప్రచురిత జ్ఞాన సంపదను సంరక్షించడం, నమోదు చేయడం మరియు దేశ వారసత్వంగా రూపొందించడం అనేది ఒక చారికల సంప్రదాయం. ఈ ప్రయత్నంలో రెండు చట్టాలు మూలస్తంభాలుగా నిలుస్తాయి. 1867లోని ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ యాక్ట్, 1954లోని డెలివరీ ఆఫ్ బుక్స్ అండ్ న్యూస్పేపర్స్ (పబ్లిక్ లైబ్రరీస్) యాక్ట్. ఈ చట్టాలు దేశంలో ప్రచురించే ప్రతి ప్రతిని రాష్ట్రం జ్ఞానాభివృద్ధి, చరిత్రలో భాగంగా నమోదు చేయడానికి ఒక న్యాయపరమైన వ్యవస్థను (లీగల్ డిపాజిట్) ఏర్పాటు చేశాయి. పబ్లిక్ లైబ్రరీలు ఈ వ్యవస్థలో కీలక పాత్ర వహించి, జాతీయ జ్ఞానభాండాగారాలను నిర్మించడంలో సహాయపడతాయి. 1. ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ యాక్ట్, 1867: లైబ్రరీ సందర్భంలో లక్షణాలు, విధులు: బ్రిటిష్ పాలనలో 1867లో ప్రవేశ పెట్టబడిన ఈ చట్టం, భారతదేశంలో ప్రచురణలను నియంత్రించడానికి, నమోదు చేయడానికి మొదటి ప్రధాన చట్టపరమైన చర్య. లైబ్రరీల సందర్భంలో దీని ప్రాముఖ్యత మూడు ప్రధాన రంగాలలో కనిపిస్తుంది, రాష్ట్ర స్థాయి నిక్షేపణకు పునాది (ఫౌండేషన్ ఫర్ స్టేట్ లెవెల్ డిపాజిట్): ఈ చట్టం ప్రకారం, దేశంలో ప్రచురించిన ప్రతి పుస్తకం, పత్రిక, పంపిణీదారుడు లేదా ప్రచురణకర్త ప్రతిని సంబంధిత ప్రాంతీయ ప్రభుత్వానికి (ప్రెసిడెన్సీ ప్రభుత్వాలు) సమర్పించాలని నిబంధన ఉంది. ఇది రాష్ట్ర స్థాయిలో ప్రచురణలను సేకరించడానికి, నమోదు చేయడానికి ఒక అధికారిక వ్యవస్థను సృష్టించింది.

వనరులను సంరక్షించే గ్రంథాలయాలు

రాష్ట్ర కేంద్ర లైబ్రరీ సేకరణల నిర్మాణంలో పాత్ర (రోల్ ఇన్ బిల్డింగ్ స్టేట్ సెంట్రల్ లైబ్రరీ కలెక్షన్స్): ఈ చట్టం ద్వారా సేకరించిన పుస్తకాలు తరువాత వివిధ ప్రాంతాలలోని ప్రధాన లైబ్రరీలకు (చెన్నై, కోల్ కతా, ముంబై) బదిలీ అయ్యాయి. ఇలా ఈ లైబ్రరీలు తమ ప్రాంతంలో ప్రచురించిన వనరులను సంరక్షించే 'రాష్ట్ర కేంద్ర గ్రంథాలయాలుగా' వ్యవహరించడానికి ఈ చట్టం పునాది వేసింది. కాలక్రమేణా ఈ లైబ్రరీలు గొప్ప జ్ఞాన సంపద కేంద్రాలుగా మారాయి. రాష్ట్ర లైబ్రరీ చట్టాల ద్వారా అమలు (ఇంప్లిమెంటేషన్ త్రూ స్టేట్ లైబ్రరీ యాక్ట్స్): 1867 చట్టం స్ఫూర్తితో, వివిధ రాష్ట్రాలు తమ తమ స్వంత పబ్లిక్ లైబ్రరీ చట్టాలను రూపొందించుకున్నాయి. ఈ చట్టాలు లైబ్రరీలను నిర్వహించడానికి, చట్టబద్ధ నిక్షేప వ్యవస్థను మరింత శక్తివంతం చేయడానికి ఒక చట్టపరమైన రూపురేఖలను అందించాయి. తమిళనాడు పబ్లిక్ లైబ్రరీ చట్టం, 1948: ఇది రాష్ట్రంలో లైబ్రరీ వ్యవస్థలను స్థాపించడానికి మరియు నియంత్రించడానికి ఒక సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేసింది. చెన్నైలోని కన్నెమర పబ్లిక్ లైబ్రరీ (ఇప్పుడు అనేక చట్టాల ప్రకారం డిపాజిటరీ లైబ్రరీగా పనిచేస్తోంది) వంటి లైబ్రరీలు ఈ చట్టం కింద లబ్ధి పొందాయి. రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీ మరియు సమాచార కేంద్రాల చట్టం 2008 (ఉదా: బిహార్): ఇటీవలి చట్టాలు, సమాచార సాంకేతికత మార్పులను అంగీకరిస్తూ, లైబ్రరీలను సమాచార కేంద్రాలుగా మార్చడానికి మరియు డిజిటల్ నిక్షేపణ వంటి ఆధునిక



అవసరాలను పరిష్కరించడానికి రూపొందించబడ్డాయి. ఈ చట్టాలు తరచుగా చట్టబద్ధ నిక్షేపానికి సంబంధించిన నిబంధనలను కలిగి ఉంటాయి.

పబ్లిక్ లైబ్రరీస్ యాక్ట్, 1954 లక్షణాలు

స్వాతంత్ర్యం తరువాత, 1954లో ప్రవేశపెట్టబడిన ఈ చట్టం, జాతీయ స్థాయిలో చట్టబద్ధ నిక్షేప వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. కేంద్రీకృతం చేసింది. కోర్ పర్పస్ (ప్రధాన ఉద్దేశ్యం): ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం, భారతదేశంలో ప్రచురించబడిన ప్రతి ప్రచురణ (పుస్తకాలు, పత్రికలు, జర్నల్స్ మొదలైనవి) నుండి కొన్ని ప్రతులు, ప్రత్యేకంగా గుర్తించబడిన జాతీయ మరియు ప్రాంతీయ లైబ్రరీలకు (డిజిగ్నేటెడ్ డిపాజిటరీ లైబ్రరీస్) స్వయంచాలకంగా, ఉచితంగా అందేలా చూసుకోవడం. ఇది 1867 చట్టంలో ఉన్న అంశాలను విస్తరించి, దాన్ని ఎక్కువ సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా చేసింది. గ్రంథాలయాలు (డిజిగ్నేటెడ్ డిపాజిటరీ లైబ్రరీస్): ఈ చట్టం కింద, నాలుగు లైబ్రరీలు ప్రధాన జాతీయ నిక్షేప గ్రంథాలయాలుగా నియమించబడ్డాయి. ప్రతి ప్రచురణకర్త తన ప్రచురణ నుండి ప్రతిని వీటికి పంపాలి. 1. నేషనల్ లైబ్రరీ, కోల్ కతా, 2. కన్నెమర పబ్లిక్ లైబ్రరీ చెన్నై, 3. సెంట్రల్ లైబ్రరీ, ముంబై, 4. ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ, ఢిల్లీ: ఉత్తర భారతదేశం, హిందీ భాషా ప్రచురణలకు సంబంధించి ఇది ప్రాథమిక నిక్షేప గ్రంథాలయంగా పనిచేస్తుంది.

స్వయంచాలక నిక్షేపం ద్వారా

ఈ చట్టం స్వయంచాలక నిక్షేపం ద్వారా, భారతదేశంలో ప్రచురించబడిన అన్ని రకాల సాహిత్యం, పరిశోధన, జ్ఞానం సంపూర్ణ, నిరంతరాయమైన సేకరణను నిర్ధారిస్తుంది. ఈ విధంగా, ఇది జాతీయ లైబ్రరీ సేకరణలను నిర్మించడానికి పునాదిగా పనిచేస్తుంది, ఇవి భవిష్యత్ తరాల కోసం జాతీయ జ్ఞానం, సాంస్కృతిక వారసత్వాన్ని అందుకొనేలా చేస్తాయి. లైబ్రరీ నమోదు ప్రణాళిక ప్రాముఖ్యత (సిగ్నిఫికెన్స్ ఇన్ లైబ్రరీ రిజిస్ట్రేషన్ ప్లానింగ్): లైబ్రరీ, సమాచార శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ప్రణాళికదారులకు, ఈ చట్టాలు చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే, ఇవి జాతీయ బిబ్లియోగ్రఫీ (భారతీయ గ్రంథ పట్టిక) సృష్టికి ఆధారాన్ని అందిస్తాయి. ఈ చట్టాల ద్వారా నిర్మించబడిన నిక్షేప వ్యవస్థ ద్వారా, (ఐఎస్బిఎన్) (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నంబర్), (ఐఎస్ఎస్ఎన్) (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ సీరియల్ నంబర్) వంటి ఆధునిక నమోదు వ్యవస్థలు మరింత సమగ్రంగా ఉండేలా చేస్తాయి. లైబ్రరీలు తమ సేకరణ అభివృద్ధి విధానాలను రూపొందించేటప్పుడు, వీటి ద్వారా అందుబాటులో ఉండే వనరుల గురించి తెలుసుకోవచ్చు. ఈ చట్టాలు కాపీరైట్ పరిరక్షణ, ముద్రణా చరిత్ర పరిశోధన, సాంస్కృతిక అధ్యయనాలకు చట్టపరమైన మద్దతును ఇస్తాయి.

జ్ఞాన వారసత్వాన్ని రక్షించడానికి

చివరిగా, ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ యాక్ట్ (1867), డెలివరీ ఆఫ్ బుక్స్ యాక్ట్ (1954) దేశ జ్ఞాన వారసత్వాన్ని రక్షించడానికి రూపొందించబడిన పరస్పరం అనుబంధితమైన చట్టపర నిర్మాణాలు. డిజిటల్ యుగంలో, ఈ చట్టాల సూత్రాలు ఇప్పటికీ ప్రస్తుతం ఉన్నాయి, అయితే, ఇప్పుడు ఈ ప్రచురణలు, డిజిటల్ వనరుల నిక్షేపానికి సవాళ్లు, అవకాశాలను ఎదుర్కొంటున్నాయి. అయినప్పటికీ, ఈ చారికల చట్టాలు భారతదేశం ముద్రిత, ప్రచురిత చరిత్రను శాశ్వతంగా నమోదు చేసిన చట్టపర వ్యవస్థ మూల స్తంభాలుగా మిగిలి ఉన్నాయి.

(వ్యాస రచయిత సామాజిక, ఆర్థిక విశ్లేషకులు)

రష్యాతో భారత్ వ్యూహాత్మక అడుగు



చిటికెన కిరణ్ కుమార్
9490841284

దేశాల మధ్య సంబంధాలు ఇప్పుడు చేతుల కలయికలతో కాదు, కాలానికి ఎదురొడ్డి నిలిచే నిర్ణయాలతో కొలవబడుతున్నాయి. ప్రపంచం తీవ్రమైన ఒడిదుడుకుల మధ్య ప్రయాణిస్తున్న వేళ, ప్రతి దేశం తన భద్రత, తన ఆర్థిక శ్వాస, తన ప్రజల భవిష్యత్తు, ఈ మూడు అంశాల మధ్య సమతౌల్యాన్ని వెతుక్కుంటోంది. అటువంటి సమయంలో భారత్ తీసుకునే ప్రతి అంతర్జాతీయ నిర్ణయం కేవలం రాజకీయం వరకే పరిమితం కాకుండా, కోట్లాది ప్రజల దైనందిన జీవితాలపై ప్రభావం చూపే స్థాయికి చేరుకుంటోంది. యుద్ధ భయాలు ఒకవైపు, ఆర్థిక ఒత్తిళ్లు మరోవైపు పెరుగుతున్న ఈ కాలంలో, భారత్ శాంతి, అభివృద్ధి, స్వతంత్ర నిర్ణయం అనే మూల్యాలను ఆధారంగా చేసుకొని తన దారిని నిర్మించుకుంటోంది. ఈ నేపథ్యంలోనే భారత్-రష్యాల మధ్య జరిగిన ఉన్నత స్థాయి భేటీ ఒక సాధారణ దౌత్య సంఘటనగా కాకుండా, దేశ భవిష్యత్ దిశను సూచించే ఒక కీలక ఘట్టంగా ప్రపంచ వేదికపై నిలిచింది.

ఇరు దేశాల భవిష్యత్, భద్రత, ఆర్థిక స్థిరత్వం

ప్రపంచం వేగంగా మారుతున్న ఈ కాలంలో దేశాల మధ్య సంబంధాలు కేవలం స్నేహ సూచికలుగా కాకుండా, ఆ దేశాల భవిష్యత్ భద్రత, ఆర్థిక స్థిరత్వం, సాంకేతిక పురోగతి, ప్రజల జీవన ప్రమాణాలతో ముడిపడి కొనసాగుతున్నాయి. ఇలాంటి సందర్భంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారతదేశానికి విచ్చేయడం ఒక సాధారణ దౌత్య పర్యటనగా కాకుండా, అంతర్జాతీయ రాజకీయాలలో ఒక కీలక మైలురాయిగా మారింది. ఈ భేటీ ప్రపంచ శక్తిసమీకరణల మధ్య భారత్ తన స్థానం ఎలా నిలబెట్టుకుంటుందో స్పష్టంగా తెలియజేసిన సందర్భమైంది. ఈ పర్యటనలో ఇంధన భద్రత, రక్షణ సహకారం, సాంకేతిక మార్పిడులు, పెట్టుబడులు, వాణిజ్యం, ఖనిజ వనరులు వంటి అనేక రంగాలలో రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయి. ముఖ్యంగా రష్యా నుంచి భారత్‌కు ఇంధన సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందన్న హామీ దేశ ఆర్థిక రంగానికి ఒక స్థిరమైన ధైర్యాన్ని ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలలో అస్థిరత, సరఫరా వ్యవస్థలలో అంతరాయాల నేపథ్యంలో ఈ నిర్ణయం భారతదేశానికి విశ్వాసాన్ని పెంచే అంశంగా మారింది.

భారతదేశ శక్తి స్వావలంబన లక్ష్యాలు

దేశంలో పరిశ్రమల నడక, వ్యవసాయోత్పత్తులు, రవాణా వ్యవస్థ, విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక రంగాలు ఇంధనంపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల ఇంధన సరఫరాలో స్థిరత్వం ఉండటం అంటే దేశ ఆర్థిక ప్రవాహానికి ఒక నిర్బంధం లేకుండా మార్గం ఏర్పడినట్టే. ఈ భేటీలో మరో ముఖ్య అంశం అణుశక్తి సహకారం. అణు విద్యుత్ కేంద్రాలకు సంబంధించి ఇంధన సరఫరా, సాంకేతిక సహకారం కొనసాగుతుందన్న అంశం భారతదేశ శక్తి స్వావలంబన లక్ష్యాలకు మరింత తోడ్పడనుంది. శక్తి అవసరాలు పెరుగుతున్న వేళ సంప్రదాయ ఇంధనాలతో పాటు శుభ్రమైన శక్తి వనరులపై దృష్టి సారించడం దేశానికి అత్యంత అవసరం. ఈ దిశగా రష్యాతో కొనసాగుతున్న సహకారం భారత్‌కు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే అవకాశాలున్నాయి. వాణిజ్య రంగంలోనూ రెండు దేశాలు తమ మధ్య లావాదేవీల పరిమాణాన్ని మరింత పెంచుకోవాలన్న దిశగా చర్చలు జరిపాయి. విద్య, వైద్యం, ఔషధ తయారీ, వ్యవసాయ ఉత్పత్తులు, యంత్ర పరికరాలు వంటి రంగాలలో భాగస్వామ్యాన్ని పెంచుకోవడంపై అవగాహనలు కుదిరాయి. దీని వల్ల భారత ఉత్పత్తులకు కొత్త మార్కెట్లు తెరుచుకునే అవకాశం ఉంది. అలాగే, రష్యా నుంచి వచ్చే సాంకేతిక పరిజ్ఞానం భారత పరిశ్రమల సామర్థ్యాన్ని మరింత విస్తరించే శక్తి కలిగినదిగా మారనుంది. రక్షణ రంగంలో భారత్-రష్యా మధ్య ఉన్న దీర్ఘకాలిక సహకారం మరోసారి స్థిరపడింది.

అంతర్జాతీయంగా పరిపక్వ దౌత్య విధానం

సాంకేతిక బదిలీలు, యంత్రసామగ్రి సంస్కరణలు, సంయుక్త ఉత్పత్తి వంటి అంశాలపై చర్చలు కొనసాగాయి. ఇది కేవలం ఆయుధాల కొనుగోలు వరకే పరిమితమయ్యే సంబంధంగా కాకుండా, వినియోగదశ నుంచి తయారీ దశ వరకూ కలిసి నడిచే దిశగా ముందుకు సాగుతుందన్న సంకేతాలను ఇచ్చింది. దీని ఫలితంగా దేశీయ రక్షణ పరిశ్రమకు మరింత బలం చేకూరే అవకాశం ఉంది. ఈ పర్యటన సందర్భంగా ప్రపంచ రాజకీయాలపై భారతదేశం అవలంబిస్తున్న సమతౌల్య దౌత్య విధానం మరోసారి స్పష్టంగా కనిపించింది. ఏ ఒక్క శక్తి క్షేత్రానికి పూర్తిగా లోబడకుండా, అన్ని దేశాలతో స్వతంత్రమైన సంబంధాలు కొనసాగించడమే భారత విదేశాంగ విధానంలోని ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది. ఈ విధానం ద్వారా భారత్ తన ఆర్థిక అవసరాలు, భద్రతా అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాలను సమర్థవంతంగా సాధించగలుగుతోందన్న విషయానికి ఈ భేటీ మరో ఉదాహరణగా నిలిచింది. ప్రపంచంలో మారుతున్న యుద్ధ, శాంతి పరిస్థితుల మధ్య కూడా భారత్ తన నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకుంటూ, దేశ ప్రయోజనాలనే కేంద్రంగా పెట్టుకుని ముందుకెళ్తున్న విధానం అంతర్జాతీయంగా ఒక పరిపక్వ దౌత్య విధానంగా గుర్తింపు పొందుతోంది. పుతిన్ పర్యటన సందర్భంగా భారత్-రష్యా మధ్య జరిగిన చర్చలు వ్యూహాత్మక స్థిరత్వం, ఆర్థిక సహకారం, భవిష్యత్ శక్తి అవసరాలకు దీర్ఘకాలిక దిశను నిర్దేశించినట్లుగా కనిపిస్తున్నాయి.

తన మార్గాన్ని తానే నిర్ణయించుకుంటూ

ఈ భేటీ ప్రభావం తక్షణంగా కనిపించే నిర్ణయాల వరకే పరిమితం కాకుండా, రాబోయే సంవత్సరాలలో దేశ ఆర్థిక వ్యవస్థపై, పరిశ్రమల విస్తరణపై, ఉపాధి అవకాశాలపై కూడా ప్రభావం చూపే అవకాశాలున్నాయి. ఇంధన సరఫరా స్థిరపడటం వల్ల ఉత్పత్తి వ్యయాలు నియంత్రణలో ఉంటాయి. వాణిజ్య సంబంధాలు పెరగడం వల్ల దిగుమతులు, ఎగుమతులలో కొత్త సమతౌల్యం ఏర్పడుతుంది. రక్షణ రంగంలో స్వదేశీ తయారీకి ఊతం లభించే విధంగా ఒప్పందాలు అమలులోకి వస్తే దీర్ఘకాలికంగా దేశానికి ప్రయోజనం కలగనుంది. సారాంశంగా చూస్తే, ఈ పుతిన్ పర్యటన భారత్‌కు ఒక దౌత్య విజయంగా మాత్రమే కాకుండా, ఆర్థిక భద్రత, శక్తి భద్రత, వ్యూహాత్మక స్వతంత్రత అనే మూడు స్థంభాలపై నిలబడి సాగుతున్న దేశ ప్రయాణానికి మరో బలమైన ఆధారంలా మారింది. ప్రపంచ రాజకీయాలు ఎంత సంక్లిష్టంగా మారుతున్నా, భారత్ తన మార్గాన్ని తానే నిర్ణయించుకుంటూ ముందుకు సాగగలుగుతుందన్న విశ్వాసాన్ని ఈ భేటీ మరింత బలపరిచింది.

(వ్యాస రచయిత సాహితీవేత్త, సామాజిక విశ్లేషకులు)

మన దీపావళికి విశ్వ కిరీటం



ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

చీకటిని చీల్చే దివ్య భవ్య కాంతుల పర్వదినం దీపావళి. హిందూ బంధువులందరికీ దీపావళి పండుగ అనేది లోతైన భావోద్వేగాల అపూర్వ అనుభూతి. ఇలాంటి వెలుగులు చిమ్మే పండుగకు ప్రపంచ గుర్తింపు రావడం హర్షదాయకం. యునెస్కో ప్రతిష్టాత్మక 'ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ (అవ్యక్త సాంస్కృతిక వారసత్వ అంశాలు)' జాబితాలో భరతమాతకు చెందిన దీపావళి పండుగ వెలుగులు 16వ అంశంగా చేర్చబడడం భారతీయులకు, ముఖ్యంగా హిందూ సమాజానికి గర్వకారణం. దేశ రాజధాని ఎర్ర కోట సాక్షిగా జరిగిన యునెస్కో 20వ సమావేశంలో దీపావళి పండుగను ఈ ప్రతిష్టాత్మక జాబితాలో చేర్చడంతో అందని మనసులలో వెలుగులు నిండి ఆనందోత్సాహాలు ఏరులై పారుతున్నాయి. భారతీయ సాంస్కృతిక వైభవానికి, మన వారసత్వ సంపద విశిష్టతకు చిరునామాగా దీపావళికి లభించిన ఈ విశ్వ గుర్తింపు నిలుస్తున్నది. అరుదైన విలక్షణ గౌరవంతో హిందువుల ఇళ్లూ, వాకిళ్లు వేల దివ్వెలతో అలంకరించినట్లు తోస్తున్నది. తాజాగా యునెస్కో గుర్తింపు కోరుతూ 80 దేశాలు సమర్పించిన 67 ప్రతిపాదనలను పరిశీలిస్తున్న సమావేశం దీపావళి పండుగను ఎంపిక చేయడం సంతోషదాయకం.

యునెస్కో జాబితాలో చేరిన వేడుకలు

భారతదేశానికి చెందిన కుటియాట్టం నాటకం (2008), వేద జపం (2008), బౌద్ధమత శ్లోకాలు(2012), రామాయణ కథలు (2018), ముడియేత్తు (2018), రామ్‌లీలా (2008), సంకీర్తన (2013), చౌ నృత్యం (2010), కల్బేలియా (2010), పండవాని (2010), యోగా (2016), కుంభమేళా (2017), కలకత్తా దుర్గా పూజా (2021), గర్బా (2023), నైరోజ్ (2024) చేరిన జాబితాలో నేడు దీపావళి (2025) కూడా సాంస్కృతిక వారసత్వ వేడుకలు లేదా పండుగగా చేర్చారు. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 140కి పైగా దేశాలకు చెందిన 490 సాంస్కృతిక వారసత్వ సంపదలను యునెస్కో గుర్తించడం విశేషం. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నాం. నరకాసురున్ని శ్రీకృష్ణుడు సంహరించినా రోజుగా, రాక్షస రాజు రావణున్ని సంహరించినిన శ్రీరాముడు తిరిగి అయోధ్యకు వచ్చిన శుభ గడియలుగా,



లక్ష్మీదేవి ఆవిర్భావంగా కూడా దీపావళిని జరుపుకోవడం కొనసాగుతున్నది.

దివ్వెల దీపావళి కాంతులు విరజిమ్మే

అధర్మంపై ధర్మం, చీకటిపై వెలుగులు, చెడుపై మంచి సాధించిన విజయాలకు ప్రతీకగా దివ్వెల దీపావళి కాంతులు విరజిమ్మే పండుగగా జురుపుకుంటున్నాం. ఐదు రోజులు జరుపుకునే దీపావళి పండుగ ఆశ్వయుజ బహుళ త్రయోదశి నుంచి కార్తీక శుద్ధ విదియ వరకు నిర్వహించుకుంటున్నాం. ఈ ఐదు రోజులలో దీపావళి, గోవర్ధన పూజ, భగినీ హస్త భోజనం అనబడే ప్రధాన వేడుకలు జరుపుకుంటాం. ఈ పర్వదినం రోజు తీపి పదార్థాలను ఆస్వాదిస్తూ, దీపాలను వెలిగిస్తూ, ముఖాలలో నవ్వుల పువ్వులను పూయిస్తూ, మానవత్వ హస్తాలతో మానవహారాలు కడుతూ జరుపుకునే దీపావళి వేడుక శాంతి సౌభాగ్యాలకు చిరునామాగా నిలుస్తున్నది.

(దీపావళికి యునెస్కో సాంస్కృతిక వారసత్వ హోదా లభించిన శుభ సందర్భంగా)

(వ్యాస రచయిత సామాజిక, ఆధ్యాత్మిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

మెదక్‌లో ప్రశాంతంగా తొలి విడత సర్పంచ్ ఎన్నికలు

- **రెండు మండలాల్లో కాంగ్రెస్ ఆధిపత్యం**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 11: మెదక్ నియోజకవర్గంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఎలాంటి అశాంతి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించారు. ఈ విడతలో పాపన్నపేట, హవేలీ ఘనపూర్ మండలాల్లో పోలింగ్ జరిగింది. పాపన్నపేట మండలంలో మొత్తం 40 గ్రామ పంచాయతీలలో ఆరు గ్రామాలు ఏకగ్రీవం కాగా, మిగతా 34 గ్రామాల్లో మరియు వార్డు సభ్య స్థానాలకు ఎన్నికలు జరిగాయి. హవేలీ ఘనపూర్ మండలంలో 30 గ్రామ పంచాయతీలలో ఒకటి ఏకగ్రీవమవగా, 29 గ్రామ పంచాయతీలకు పోలింగ్ నిర్వహించబడింది. హవేలీ ఘనపూర్ మండలంలో సర్పంచ్ పదవికి గెలుపొందిన అభ్యర్థులలో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. మొత్తం 30 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ అభ్యర్థులు 18 చోట్ల విజయం సాధించారు. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఎనిమిది గ్రామాల్లో గెలుపొందగా, నలుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. గజిరెడ్డిపల్లి వంటి కొన్ని గ్రామాలు ఏకగ్రీవంగా కాంగ్రెస్ అభ్యర్థుల పేరుతో ఎన్నికైనవి. పాపన్నపేట మండలంలో కూడా పోలింగ్ ఉత్సాహంగా జరిగింది. మొత్తం 40 గ్రామాల్లో ఆరు గ్రామాలు — అంరియా తండా, కందింపల్లి, లక్ష్మీనగర్, మల్లంపేట్, నామాపూర్, యూసిపేట — ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగతా 34 గ్రామాల్లో 93 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీ చేయగా, 250 వార్డుల కోసం 545 మంది పోటీదారులు రంగంలో నిలిచారు. ఉదయం నుంచే ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించారు. మొత్తం మీద, మెదక్ తొలి విడత పంచాయతీ ఎన్నికలు ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. కాన్గ్రెస్ పార్టీ రెండు మండలాల్లో బలమైన స్థానాన్ని ప్రదర్శించగా, బిఆర్ఎస్ మరియు స్వతంత్ర అభ్యర్థులు కూడా కొన్ని చోట్ల తమ ప్రభావాన్ని చూపించారు.

పోటీ చేయమని పట్టించుకోవడం లేదు

- **పార్టీ వ్యక్తిని కాదని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి సపోర్ట్ చేస్తున్నారు.**
- **పుల్లూరు సర్పంచ్ అభ్యర్థి ఆవేదన**



ప్రతిపక్షం, సిద్దిపేట ,డిసెంబర్ 11: తమ గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో, పార్టీ పెద్దల సూచన మేరకు తాము గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసి, బరిలో నిలిచామని, కాని తమకు పార్టీ పెద్దలు కానీ, గ్రామ శాఖ, మండల శాఖ నాయకులు గాని ఎవరు సపోర్టు చేయడం లేదని మండల పరిధిలోని పుల్లూరు గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి కర్రె యాదమ్మ కనకయ్య దంపతులు ఆవేదన వ్యక్తం చేసారు. గురువారం గ్రామంలో వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున తమ గ్రామం నుండి నామినేషన్ వేయడానికి నాయకులు ఎవరూ ముందుకు రాకపోవడంతో, నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ కోశాధికారిగా, ఇందిరమ్మ కమిటీ మెంబర్ గా ఉన్న తాను తన భార్య యాదమ్మతో కలిసి నామినేషన్ వేయించానని, ఈ విషయం గ్రామ, మండల స్థాయి నాయకులకు తెలిసినప్పటికీ నామినేషన్ వేసినప్పటి నుండి తనకు సహకరించడం లేదని కనకయ్య వాపోయారు. పార్టీకి చెందిన తనను కాదని బిఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సపోర్ట్ చేస్తున్నారని, తమను మానసికంగా కృంగదీస్తున్నారని ఆ దంపతులు వాపోయారు. పుల్లూరు గ్రామం జనరల్ మహిళ రావడం, ఆ స్థానంలో ఎస్సి కులానికి చెందిన తాము పోటీలో ఉండగా తమకు ఎవరు సపోర్ట్ చేయకపోవడం బాధాకరమని తాము దళితులమైనందు వల్లే తమను దూరం పెట్టారని వాపోయారు. ఇప్పటికైనా తమకు పార్టీ నాయకులు సహకరించాలని, తమను కాదని వేరే పార్టీ అభ్యర్థికి సహకారం అందిస్తున్న వారిని గుర్తించి పదవుల నుండి తీసివేయాలని, పార్టీ అధిష్టానం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రేమ వివాహం... దంపతులకు శాపం

- **అత్త మామ వరకట్న వేధింపులు**
- **భరించలేక సెల్ టవర్ ఎక్కి దంపతుల ఆత్మహత్యాయత్నం**
- **పోలీసుల హామీతో టవర్ దిగిన దంపతులు**



ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 11: నాలుగేళ్ల క్రితం జరిగిన ప్రేమ వివాహం.. దంపతులకు శాపంగా మారింది. అత్త, మామల వరకట్న వేధింపులే కారణమని ఆరోపిస్తూ భార్యాభర్తలిద్దరూ కలిసి ఆత్మహత్యాయత్నానికి దిగిన ఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు తీవ్ర రూపం దాల్చడంతో సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకునే స్థితికి చేరిన దంపతులు, టవర్ ఎక్కడానికి ముందే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వాట్సాప్ గ్రూపుల్లో తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని వీడియో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ అవడంతో స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకుని దంతులిద్దరికీ నచ్చజెప్పి టవర్ పై నుంచి కిందికి దిగేలా చేశారు. వివరాల్లోకి వెళితే సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన కోల రాములు, విజయలక్ష్మి దంపతుల కుమారుడైన కోల శ్రీకాంత్ కడప జిల్లాకు చెందిన వరలక్ష్మీ అనే అమ్మాయిని నాలుగేళ్ల కిందట ప్రేమవివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. తన అత్తామామలు వేధిస్తున్నారని, గర్భవతి అయిన తనను ఇంట్లో నుంచి వెళ్ల గొట్టారని 2024 నవంబర్ 7 వ తేదీన రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు వరలక్ష్మి పిర్యాదు చేసింది. అయినప్పటికీ వేధింపులు తగ్గలేదని, ఆరోపిస్తూ భార్యాభర్తలిద్దరూ (శ్రీకాంత్, వరలక్ష్మి) కలిసి వేధింపులను తట్టుకోలేక తాము చనిపోతున్నట్లుగా వీడియో రికార్డు చేసి గురువారం వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ అయ్యింది. 100 నెంబర్ కు డయల్ చేసి చెప్పారు. అనంతరం సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామని పేర్కొన్నారు. వెంటనే స్పందించి అక్కడికి చేరుకున్న ఎస్సై వివేక్ ఫోన్ లో వారితో మాట్లాడి వారి బాధలను తెలుసుకున్నారు. గతంలో అత్త,మామలపై కేసు పెట్టిన విషయాన్ని వారు ఎస్సైకి వివరించారు. ఎస్సైతో పాటు గ్రామస్థులు, స్థానిక నాయకులు కలిసి దంపతులకు నచ్చజెప్పారు. తగిన న్యాయం చేస్తామని ఎస్సై వివేక్ హామీ ఇవ్వడంతో దంపతులు సెల్ టవర్ పై నుంచి కిందకు దిగారు. అనంతరం దంపతులిద్దరినీ కౌన్సిలింగ్ నిమిత్తం రాజగోపాలపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



అప్పుల బాధ తాళలేక కేబుల్ ఆపరేటర్ ఆత్మహత్య

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 11: అప్పుల బాధ తాళలేక కేబుల్ ఆపరేటర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాలలో గురువారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్ఐ సమత తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చలిమిటి అంజనేయులు (36) కేబుల్ ఆపరేటర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కేబుల్ నిర్వహణకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య వర్షిత ఉన్నారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

- **కస్తూరిపల్లి సర్పంచ్ అభ్యర్థి తాళ్లపల్లి స్వామి**



ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్11: అవకాశం ఇస్తే కస్తూరిపల్లి గ్రామాన్ని మండలంలోని ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దుతానని కస్తూరిపల్లి సర్పంచ్ అభ్యర్థి తాళ్లపల్లి స్వామి అన్నారు. గురువారం కస్తూరిపల్లి పల్లి లో ఇంటి ఇంటి ప్రచారం నిర్వహించి బాట్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి ,ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉండి సేవ చేస్తానని తాను పేదరికంలో పుట్టి పెరిగానని ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన ఉందని ఒక్క అవకాశం ఇస్తే చిన్నకోడూరు మండలంలోని కస్తూర్ పల్లి ని ఆదర్శ గ్రామంగా రూపురేఖలు మారుస్తానని అన్నారు. గ్రామ పెద్దలు , గ్రామ ప్రజల సహకారంతో తాను గత ఎన్నికల్లో ఉపసర్పంచ్ గా గెలిచి ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యే హరీష్ రావు సహకారం తో తమ వంతు సేవలందించి గ్రామం అభివృద్ధిలో బాగ్యస్వామ్యం అయ్యానన్నారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేవని, ఈ విషయం గ్రామ ప్రజలుఅందరికీ తెలుసునని ప్రజల ఆశీర్వాదంతో తాను గెలిస్తే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడతానని నిత్యం అందుబాటులో ఉండి సేవ చేసే భాగ్యం కల్పించాలని ఆయన పేర్కొన్నారు.



పల్లెల్లో ప్రచార హోరు.. గులాబీ జోరు

- **సర్పంచ్, వార్డు అభ్యర్థులకు మద్దతు**
- **బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మదేవేందర్ రెడ్డి**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 11: మెదక్ మండలం మక్తభూపతిపూర్ గ్రామంలో బిఅర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి చెవిటి అశోక్,వార్డు సభ్యులకు మద్దతుగా బిఅర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, యం. పద్మాదేవేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి ,బిఅర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటి ఇంటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థి చెవిటి అశోక్ ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు అయ్యేలా తీర్పుఇవ్వాలని ఓటర్లను కోరారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో పది సంవత్సరాలు గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకు పోయాయని పేర్కొన్నారు.గత 10 ఏండ్ల పాలనలో విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ అందించారని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులలో గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని పేర్కొన్నారు. బిఅర్ఎస్ పార్టీ సర్పంచ్ లు ఉంటే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనీ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలను ఈ ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించాలన్నారు.అమలు కానీ హామీలు గుప్పిస్తూ, కల్లబొల్లి మాయమాటలతో ఓట్లు వేయించుకున్నారని మండిపడ్డారు. పల్లెలోల వీధిలైట్లు కాలిపోతే తెప్పించే పరిస్థితి నేడు లేదని, తడి, పొడి చెత్తను సేకరించేందుకు జీపీకి ఏర్పాటు చేసిన ట్రాక్టర్లు మూలన పడేశారని దుయ్యబట్టారు.జీపీ సిబ్బందికి వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అభివృద్ధి మళ్ళీ జరగాలంటే బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీవైస్ చైర్మెన్ యం.లావణ్య రెడ్డి ,మెదక్ మండల అధ్యక్షులు యం. అంజా గౌడ్,మాజీ ఎంపిపి కిష్టయ్య, మాజీ సర్పంచ్ లు సుంకరి.నర్సింలు, గట్టయ్య,మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ ,గ్రామ పార్టీ అధ్యక్షుడు కుసంగి సత్యనారాయణ గౌడ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ షకీర్ అహ్మద్,మండల మండల సోషల్ మీడియా ఇంచార్జ్ ఎంబీపూర్. మహేష్, మాజీ వార్డు మెంబర్లు, బిఆర్ఎస్ అభ్యర్థులు ,పార్టీ శ్రేణులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా


- **ర్యాలమడుగు గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఈగ రవి**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 11: నిత్యం గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాన్నీ అభివృద్ధి వైపు నడిపిస్తానని, సేవ చేసేందుకు తనను గ్రామ సర్పంచ్ గా గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఈగ. రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాభివృద్దే ధ్యేయంగా కృషి చేస్తానని అన్నారు.ఈ నెల 14న జరిగే రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. బ్యాలెట్ నమూనా పత్రాలను ఓటర్లకు చూపిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి ఈగ. రవి మాట్లాడుతూ... తనకు కేటాయించిన ఉంగరం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. గ్రామ ప్రజలకు సేవ చేయడానికి నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.



దుంపల రమ్య రాజు ఇంటింటి ప్రచారం

ప్రతిపక్షం, చేగుంట, డిసెంబర్ 11: బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి దుంపల రమ్య రాజు ప్రచారం ముమ్మరం చేశారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆశీస్సులతో ముందుకు సాగుతున్నారు. చేగుంట మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ అలీ పలువురు మైనార్టీ పెద్దలు పలువురు గ్రామ పెద్దల సహకారంతో ప్రచారం ముమ్మరం చేశారు. ప్రచార రథాలతో హోరెత్తిన పాటలతో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. దుంపల రమ్య కు కేటాయించిన ఉంగరం గుర్తు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గోడ వాల్ పోస్టర్లు ఏర్పాటుతో కరపత్రాలను విడుదల చేశారు. మహంకాళి అమ్మవారు జాతర ఉత్సవాల్లో పలహార బండి ప్రదర్శించే దుంపల రమ్య డిష్‌రాజు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నారు.



అయ్యప్ప స్వామి కృపతో ప్రజలందరూ చల్లగా ఉండాలి


- **ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 11: అయ్యప్ప స్వామి కృపతో ప్రజలందరూ చల్లగా ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులో బి ఆర్ ఎస్ పార్టీ నాయకురాలు ధాత్రిక భాగ్యలక్ష్మీ నారాయణ దంపతులు నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాల తో పాడి పంటల తో చల్లగా ఉండాలని ఆ భగవంతుని కోరుకున్నాట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బి. మనోహర్ రావు , మాజీ జడ్పీ టి సి కడతల రవీందర్ రెడ్డి,మాజీ ప్రజాప్రతినిధులు, బి ఆర్ ఎస్ నాయకులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంపై నియంత్రణ

- **జిల్లా కలెక్టర్ హైమవతి**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 11: సిద్దిపేట జిల్లాలో 2వ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 14వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనున్న నేపథ్యంలో, ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచారానికి కఠిన నియంత్రణలు అమల్లోకి వస్తాయని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి కే. హైమావతి ప్రకటించారు.అక్కన్నపేట్ , భూంపల్లి, బెజ్జంకి, చిన్నకోదూర్, దుబ్బాక, మిరుదొడ్డి, నంగునూరు, నారాయణరావుపేట్, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, తొగుట మండలాల పరిధిలో జరిగే ఈ ఎన్నికల సందర్భంలో డిసెంబర్ 12 సాయంత్రం 5 గంటల తర్వాత ఏ విధమైన ఎన్నికల ప్రచారం అనుమతించబడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం జిల్లాలోని ఈ 10 మండలాల గ్రామాల్లో డిసెంబర్ 12 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 14న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలను మూసివేయాలి అని ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలో ఎన్నికలు నిష్పాక్షికంగా, శాంతియుతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ హైమావతి తెలిపారు.



పోలింగ్ పర్యవేక్షించిన కలెక్టర్ హైమావతి

జిల్లాలో నేడు జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి విడతలో ఏడు మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో నుంచి నేరుగా పరిశీలించారు.అయా మండలాల ఎంపీడీఓలకు పలు సూచనలు చేసిన కలెక్టర్, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు వెబ్‌కాస్టింగ్‌ను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, ఈడిఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఓటును వినియోగించుకున్న గజ్వేల్ బీఆర్ఎస్ ఇంచార్జ్

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 11: మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నికలలో భాగంగా గురువారం నాడు నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతోపాటు బూరుగుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వంటేరు విజయవర్ధన్ రెడ్డి కూడా కలిసి ఓటు వేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతాప్ రెడ్డి తో పాటు పాల్గొన్నారు.



2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.77 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 1.24 లక్షల మరణాలకు ఓవర్ స్పీడ్ కారణం. 69,088 మంది సీట్‌బెల్ట్, హెల్మెట్ వాడకపోవడం వల్ల మరణించారు. స్పీడ్ డ్రైవింగ్ మరణాల్లో తమిళనాడు టాప్‌లో, కర్ణాటక, మధ్యప్రదేశ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2023లో తగ్గిన మరణాలు ఈ ఏడాది మళ్లీ పెరిగాయి.

- రాజ్యసభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్రాంతీయం




పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ

ప్రతిపక్షం ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 11: రామగుండం కమిషనరేట్ పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు. మంథని మండలం గుంజపడుగు, నాగారం, చిల్లపల్లి, వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సదుపాయాలను పరిశీలించారు. ఓటింగ్ తరువాత, కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి తరువాత కూడా ఎలాంటి అవాంఛనియా సంఘటనలు, గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. ఎన్నికల శాంతి భద్రత కోసం పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, ఓటర్లు భయ భ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడిన సీపీ

గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంథని మండలం గుంజపడుగు ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటు హక్కును వినియోగించు కోవడానికి వచ్చిన వృద్ధురాలితో సీపీ ఆప్యాయంగా మాట్లాడి ఆమె ఓటరు గుర్తింపు వివరాలు వార్డు సమాచారం తెలుసుకున్నారు. ఓటు ఎక్కడ పోలింగ్ బూత్ లో వినియోగించుకోవాలో తెలిపారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు ప్రతి ఓటరు స్వేచ్ఛగా భయభ్రాంతులు లేకుండా తమ ఓటు వేయడానికి సమగ్రంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.



కౌంటింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 11: జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామంలోనీ కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు.కౌంటింగ్ హాల్ లో ఏర్పాట్లు, ఏజెంట్లకు కల్పించిన సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా, ఖచ్చితంగా, నిబంధనలకు లోబడి కౌంటింగ్ నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు .కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, తహసిల్దార్ అశోక్ ఉన్నారు.



నారాయణకు ఏపీజే అబ్దుల్ కలామ్ ఎక్సలెన్సీ అవార్డ్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 11 : ఏపీజే అబ్దుల్ కలామ్ ఎక్సలెన్సీ అవార్డ్ ను నిజామాబాద్ కు చెందిన సామాజిక న్యాయ ప్రపంచ మానవ హక్కుల సంస్థ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ మాలేపు నారాయణ అందుకున్నారు. డిసెంబర్ 10 అంతర్జాతీయ మానహక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయనకు అవార్డు ను అందజేశారు. ఫైనాన్స్ బాధితులకు అండగా నిలిచినందుకు, మానవ హక్కుల బాధ్యతల డ్రగ్స్ కు యువత బలి కాకూడదని విద్యార్థులకు, ప్రజలకు అనేక అవగాహన సదస్సులు నిర్వహించినందుకు నేషనల్ చైర్మన్ ప్రముఖ సుప్రీమ్ కోర్టు న్యాయవాది డా. కొప్పుల విజయకుమార్, తెలంగాణ డ్రగ్స్ లా అండ్ ఎన్ఫర్స్మెంట్ నార్కోటిక్ అడిషనల్ ఎస్పీ సైదులు, ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ప్రముఖ సుకలోజలిస్ట్ వైద్యులు హిపనో పద్మా కమలాకర్ లు ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డ్ ను అందజేశారు.



అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- గుండారం సర్పంచ్ అభ్యర్థి అంకల లక్ష్మణ్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబరు 11: ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి ఎలా ఉంటుందో గుండారం గ్రామ ప్రజలకు చూపిస్తానని సర్పంచ్ అభ్యర్థి అంకల లక్ష్మణ్ అన్నారు. లక్ష్మణ్ కు బాల్ గుర్తు కేటాయించాగ ప్రచారం లో దూసుకు పోతున్నారు. అన్ని వర్గాలను కలుస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రచారంలో ముందున్నారు. గ్రామ అభివృద్ధిలో ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని కుల సంఘాలతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీలు ఇస్తూ డ్రైనేజీ వ్యవస్థ తీవ్ర ఇబ్బందిగా ఉందని, ప్రజలను కలుపుకుని ఆ వ్యవస్థను రూపు మాపుతానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో మంచినీటి సమస్య ఉందని శాశ్వత పరిష్కారం కొరకు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇస్తున్నారు. గ్రామ ప్రజలు సర్పంచ్ గా అవకాశం కల్పిస్తే ప్రతి క్షణం అభివృద్ధికి పరిష్కార మార్గాలు చూపుతానని స్పష్టం చేశారు. అభివృద్ధి కోసం పేదల పక్షాన నిలబతానని హామీ ఇచ్చారు. గ్రామం లో చిన్నా పెద్ద తేడా లేకుండా హామీలన్నీ నెరవేర్చి రూరల్ నియోజకవర్గంలో గ్రా మాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని స్పష్టం చేశారు. ప్రజల ఆలోచనల కు అనుగుణంగా ముందుకు వచ్చిన తనను ప్రజలు పెద్ద మనసుతో ఆశీర్వదించాలని లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు. పాలనలో ఎవరి పెత్తనం లేకుండా ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడే నాలాంటి వారికి మద్దతు ఇవ్వాలని కోరారు. మంచి ఆలోచనతో నాలాంటి వారికి అండగా నిలవాలని బాల్ గుర్తుకు ఓటు వేసి సర్పంచ్ గా గెలిపించాలని గ్రామ పెద్దలు, యువతీ యువకులను గ్రామంలో కుల సంఘాలను ఆయన కోరారు.



బ్యాంకుల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల కోసం ఆర్బీఐ తెచ్చిన 'ఉద్గమ్' పోర్టల్‌ను సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకుంటున్నారు. డబ్బులు ఇప్పిస్తామంటూ నకిలీ లింకులు పంపి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. అధికారిక సైట్‌ను మాత్రమే వాడాలి. 'ఆర్బీఐ ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు అడగదు. మోసపోతే 1930కి కాల్ చేయండి.
- హైదరాబాద్‌సీపీ సజ్జనార్

నిజామాబాద్‌లో ప్రశాంతంగా మొదటి విడత పోలింగ్

- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్
- మొత్తం 184 గ్రామాలు.. 29 స్థానాలు ఏకగ్రీవం



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 11 : నిజామాబాద్ జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఉదయం 7 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. వణికించే చలిని సైతం లెక్క చేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. ఉదయం 9 గంటల సమయానికి సగటున 19.80 శాతం పోలింగ్ నమోదయ్యింది. 11 గంటల సమయానికి 50.73 శాతం ఓటింగ్ పూర్తయ్యిందని అధికారులు ప్రకటించారు. కాగా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఎడపల్లి మండలం జానకంపేట, ఎం.ఎస్.సీ ఫారంలలో, బోధన్ మండలం పెగడాపల్లిలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ లు, మెడికల్ క్యాంపు, ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? అని తనిఖీ చేశారు. కలెక్టర్ పర్యవేక్షణలో బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, నవీపేట మండలాల పరిధిలో ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మొదటి విడతలో మొత్తం 184 సర్పంచ్ స్థానాలకు గాను, నామినేషన్ల ఉపసంహరణ నాటికే 29 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో మిగిలిన 155 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి వినయ్ కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం సత్ఫలితాలు ఇచ్చింది. ఓటింగ్ ఆవశ్యకతను వివరిస్తూ ప్రతి నివాస ప్రాంతంలో వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఫొటోలతో కూడిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం, బీ.ఎల్.ఓలతో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి ఓటర్లకు వారి ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే విషయాన్ని తెలియజేసేలా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. పోలింగ్‌మధ్యాహ్నం 2 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టారు.



గెలిపించండి అభివృద్ధి చేస్తా

- శ్రీరామ్ నగర్ 5 వ వార్డు అభ్యర్థి తమ్మలి మాధవి భరత్

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 11: అవకాశం ఇచ్చి ఆదరించండి అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని శ్రీరామ్ నగర్ 5 వ వార్డు సభ్యులు అభ్యర్థి తమ్మలి మాధవి భరత్ వార్డు ఓటర్లను వేడుకున్నారు, గురువారం ఎన్నికల ప్రచారం భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించి గౌను గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు, ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ... ఈ నెల 14 న ఆదివారం జరిగే ఎన్నికలలో గౌను గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు, శ్రీరామ్ నగర్ 5 వ వార్డు అభివృద్ధికి, నిరంతనం కృషి చేస్తానని ఓటర్లకు తెలియజేశారు.

10వ వార్డు అభివృద్ధికి కృషి



మొయినాబాద్, ప్రతిపక్షం, డిసెంబర్ 11: అమ్డాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 10వ వార్డు అభివృద్ధిలో వెనుకబడిపోయిందని.. యువకుడినైన తనకు అవకాశం ఇస్తే వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అభ్యర్థి మద్యపాగ శ్రీనివాస్ (కన్నా) అన్నారు. వార్డులోని సమస్యలపై అవగాహన లేని వారు, స్థానికంగా ఉండని వారు తనపై పోటీ చేస్తున్నారని అన్నారు. స్థానికంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండే తనకు గ్యాస్ సిలిండర్‌పై ఓటు వేసి గెలిపించాలని, అభివృద్ధిని గడపగడపకు తీసుకొస్తానని హామీ ఇస్తున్నారు.

మోత్కుపల్లి సర్పంచ్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

- అభివృద్ధి కోసం గెలిపించాలని కోర్డుటి యశోద రత్నం విజ్ఞప్తి



మొయినాబాద్, ప్రతిపక్షం, డిసెంబర్ 11: మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కోర్డుటి యశోద రత్నంను గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థి విజ్ఞప్తి చేస్తున్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న సర్పంచ్ అభ్యర్థిగా కోర్డుటి యశోద రత్నంను గ్రామంలోని మహిళలు నాయకులు యువకులతో కలిసి పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నా బలం బలగం మీరేనని నిరంతరం గ్రామ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. గ్రామంలోసమస్యలు లేకుండా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు ఆదరించి సర్పంచ్ గా గెలిపిస్తే పాలకులుగా కాకుండా సేవకునిగా పనిచేస్తారని తెలిపారు. గ్రామ అభివృద్ధి ప్రజాసేవే లక్ష్యంగా సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ఇందుకు ప్రజలందరూ సహకరించి బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తారని కోరుతున్నానని తెలిపారు. ప్రజల ఆశీర్వాదమే నా గెలుపుకు నిదర్శనమని అన్నారు. గ్రామాన్ని అని రంగాలలో అభివృద్ధి చేసి మండలంతో పాటు జిల్లా రాష్ట్రంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సేవ చేసే అవకాశం ఇవ్వండి

- కనకమామిడి సర్పంచ్ అభ్యర్థి పట్లోళ్ల అంజమ్మ ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 11: డిసెంబర్ 14న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో గ్రామానికి సేవ చేసే అవకాశం ఒకసారి ఇచ్చి కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కనక మామిడి గ్రామ సర్పంచ్ అభ్యర్థి పట్లోళ్ల అంజమ్మ ప్రభాకర్ రెడ్డి, ప్రజలకు విజ్ఞప్తి చేశారు, గ్రామంలో కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... కనకమామిడి గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానన్నారు, గ్రామ సేవకుడిగా ఒక్కసారి తనకు అవకాశం ఇచ్చి గ్రామ ప్రజలు ఆశీర్వదించిచాలని కనక మామిడి గ్రామ ప్రజలను కోరారు.



ఆశీర్వదించండి... మీకు అండగా ఉంటా

- నాగిరెడ్డిగూడ గ్రామ సర్పంచ్ అభ్యర్థి కీసరి పద్మ సంజీవరెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 11 : ఈ నెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో, కత్తెర గుర్తుకు ఓటు వేసి సర్పంచ్ గా ఆశీర్వందించి గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి అభ్యర్థి కీసరి పద్మ సంజీవరెడ్డి కోరారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సర్పంచ్ గా గెలిపించి ప్రజా సేవ చేసే భాగ్యం మరోమారు కల్పించాలని ఓటర్లను కోరుకున్నారు. అవకాశం ఇస్తే గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా గ్రామ అభివృద్ధిపై పలు హామీలను వెల్లడించారు. గ్రామంలోసీసీ రోడ్డులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, హైమాక్స్ లైట్లు ఏర్పాటుకి "కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతానని తెలిపారు. ఓటర్లు కత్తెర గుర్తుకు ఓటువేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

తొలి దశ 'పంచాయతీ' ప్రశాంతం

- కరీంనగర్ జిల్లాలో 81.42 శాతం
- జగిత్యాల జిల్లాలో 77.68 శాతం
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 79.57 శాతం
- పెద్దపల్లి జిల్లాలో 82.27 శాతం



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 11: కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 81.42% పోలింగ్ నమోదు.. మొత్తం 91 గ్రామా పంచాయితీల్లో 152408 ఓట్లకు గాను 124088 ఓట్లు పోలయ్యాయి. జగిత్యాల జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడత ఎన్నికల పోలింగ్ 77.68 శాతం నమోదు అయింది. భీమారం, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, కోరుట్ల, మల్లాపూర్, మేడి పెల్లి, మెట్‌పెల్లి మండలాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు.7 మండలాల్లో కలిపి మొత్తం ఓట్లు 2,18,194 ఉండగా పోల్ 1,69,846 అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 77.68 శాతం పోలింగ్ నమోదు అయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మొదటి ఫేజ్ ఎన్నికల పోలింగ్ శాతం 79.57 గా నమోదు అయిందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు.చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు. ఐదు మండలాల్లో కలిపి మొత్తం 1,11,148 ఓట్లు ఉండగా, 88,442 పోల్ అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 79.57 శాతం పోలింగ్ నమోదు అయింది. పెద్దపల్లి జిల్లాలో మొదటి విడత 82.27 శాతం పోలింగ్ నమోదైందని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మధ్యాహ్నం 1 గంట వరకు పెద్దపల్లి జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న 5 మండలాల పరిధిలో 82.27 శాతం వరకు పోలింగ్ నమోదైందని, లక్షా 18 వేల 346 మంది ఓటర్లు తమ ఓటు హక్కు పంచాయతీ ఎన్నికల్లో వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

తల్లిపై కుమార్తె విజయం

జగిత్యాల జిల్లా తిమ్మయ్యపల్లెలో సర్పంచ్ పదవికి తల్లి, కుమార్తె తలపడ్డారు. ఈ గ్రామంలో సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ అయింది. బీఆర్ఎస్ మద్దతుతో శివరాత్రి గంగవ్వ బరిలోకి దిగారు. కాంగ్రెస్ నుంచి ఆమె కుమార్తె సుమలత పోటీ చేశారు. కాగా తల్లిపై కుమార్తె 91 ఓట్ల మెజార్టీతో గెలిచింది. గతంలో సుమలత ఓ యువకుడిని ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఇరు కుటుంబాల మధ్య వైరం నెలకొంది.

పార్లమెంట్‌లో ఈ–సిగరెట్ దుమారం

- చర్యలు తీసుకోవాలన్న అనురాగ్ ఠాకూర్



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 11: పార్లమెంట్ సమావేశాల్లో గురువారం ఈసిగరెట్ వ్యవహారం దుమారం రేపింది. లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఒకరు ఈసిగరెట్ తాగారని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో చాలా కాలంగా వాటిపై నిషేధం ఉంది. సదరు టీఎంసీ ఎంపీ అందుకోసం అనుమతి పొందారా అని సభాపతిని అడగ్గా.. లేదని సమాధానమిచ్చారు స్పీకర్ ఓం బిర్లా. నిషేధంలో ఉన్న ఈసిగరెట్లను లోక్‌సభలో తాగి.. నిబంధనలను ఉల్లంఘించిన ఆ ఎంపీపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు అనురాగ్ ఠాకూర్. పలువురు బీజేపీ ఎంపీలు కూడా ఠాకూర్‌కు మద్దతు తెలిపారు. స్పందించిన స్పీకర్.. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించారని రుజువైతే సదరు ఎంపీపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, బీజేపీ ఆరోపణలపై టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ మాట్లాడారు. పార్లమెంట్ భవనం వెలుపల ఈసిగరెట్ సేవించేందుకు అనుమతి ఉందన్న ఆయన.. తాము భవనంలో లోపల ధూమపానం చేయలేదని, బయట అందుకు అనుమతి ఉందన్నారు. 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం ఈసిగరెట్ల అమ్మకాలు, ఉత్పత్తి, నిల్వలను పూర్తిగా నిషేధం విధించింది. ఎలక్ట్రానిక్ నిషేధ చట్టం 2019 కింద ఈ నిబంధనలను అమలు చేసింది. నిషేధమున్న ఈసిగరెట్ల అమ్మకాలు పెరుగుతున్న తరుణంలో.. ఈ ఉల్లంఘనలను ప్రజలకు తెలియజేయడంలో భాగంగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2023లో ఓ ఆన్‌లైన్ పోర్టల్‌నూ ప్రారంభించింది.

విశ్వ వీక్షణం



అమెరికా బాటలో మెక్సికో..

- భారత్‌పై 50 శాతం వరకు సుంకాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 11: భారత్‌పై అమెరికా భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ట్రంప్ నిర్ణయంతో భారత్ అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇక ఇప్పుడు తాజాగా అమెరికా బాటలోనే మరో దేశం కూడా ఇండియాకి షాకిచ్చింది. భారత్ సహా పలు దక్షిణాసియా దేశాలపై సుంకాలు విధించేందుకు మెక్సికో సిద్ధమైంది. భారత్, చైనా, దక్షిణ కొరియా వంటి పలు దక్షిణాసియా దేశాల నుంచి వచ్చే దిగుమతులపై భారీగా సుంకాల్ని పెంచే బిల్లుకు మెక్సికన్ సెనెట్ బుధవారం ఆమోదం తెలిపింది. కనీసం 5 శాతం నుంచి 50 శాతం వరకు దిగుమతి సుంకాల్ని పెంచే బిల్లుకు మెక్సికో సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు 76 మంది అనుకూలంగా, 5 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. కొత్త సుంకాలు వచ్చే ఏడాది నుంచే అమల్లోకి రానున్నాయి. దుస్తులు, లోహాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఉక్కు సహా అనేక ఉత్పత్తులపై వీటి ప్రభావం పడనుంది. ఈ నిర్ణయంతో దక్షిణాసియా దేశాలపై మెక్సికో వాణిజ్య యుద్ధం ప్రకటించినట్లైంది. ఈ సుంకాలు దేశీయ తయారీని పెంచేందుకు, ముఖ్యంగా చైనాతో పెరుగుతున్న వాణిజ్య అసమతుల్యతలను పరిష్కరించడానికి ఉద్దేశించినవిగా క్లాడియా ప్రభుత్వం చెబుతోంది.



అఫ్ఘానిస్తాన్‌పై దాడి.. యుద్ధమే

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 11: అఫ్ఘానిస్థాన్ పై పాక్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులను యుద్ధ చర్యలుగా అభివర్ణించింది. ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు, క్రికెటర్లు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేసింది. ఇటువంటి దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని మండిపడింది. ఈ మేరకు తాలిబన్ పాలిత అఫ్ఘానిస్థాన్‌కు పూర్తి మద్దతు ప్రకటించింది. యూఎన్ భద్రతా మండలి సమావేశంలో భారత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను భారత్ గౌరవిస్తుందని తెలిపారు. అమాయక ప్రజల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. చాలా ఏళ్లుగా బలహీన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న అఫ్ఘాన్ ప్రజలపై దాడులు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న దేశంపై బహిరంగ బెదిరింపులు, యుద్ధ చర్యలు యూఎన్ చార్టర్, అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. వాణిజ్య, రవాణా మార్గాలను మూసివేయడం ట్రేడ్ అండ్ ట్రాన్సిట్ టెర్రరిజం అని ధ్వజమెత్తారు. ఈ మేరకు అఫ్ఘాన్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు.

అమిత్ షా ఒత్తిడిలో ఉన్నారు..

- ప్రసంగాన్ని అడ్డుకున్న రాహుల్ గాంధీ


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 11: పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా లోక్‌సభలో బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా అమిత్ షా ప్రసంగాన్ని రాహుల్ గాంధీ అడ్డుకున్నారు. ఓటర్ల జాబితాల్లో జరిగిన అవకతవకలపై చర్చ జరుపాలని సవాల్ చేశారు. దీంతో అమిత్ షా ఎదురుదాడికి దిగారు. సభలో తాను ఏం మాట్లాడాలో అన్నది ఎవరూ నిర్దేశించలేరని అన్నారు. అయితే, షా ప్రసంగాన్ని ఉద్దేశించి రాహుల్ తాజాగా స్పందించారు. ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చ సమయంలో అమిత్ షా ఆందోళనగా, ఒత్తిడికి గురైనట్లు కనిపించారని రాహుల్ అన్నారు. ఆయన వాడిన భాష కూడా సరిగా లేదని వ్యాఖ్యానించారు. 'నిన్న పార్లమెంటులో అమిత్‌షా జీ చాలా ఆందోళనగా కనిపించారు. ఆయన చేతులు వణుకుతున్నాయి. ఆయన వాడిన భాష కూడా సరిగా లేదు. అమిత్‌షా తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్నారు. ఇది నిన్న దేశమంతా చూసింది. ఆయన ఏ ప్రశ్నకూ సరిగా సమాధానం ఇవ్వలేదు. వేటికీ ఆధారం చూపలేదు. మీడియా సమావేశంలో అమిత్‌షాని నాతో చర్చకు రావాలని సవాల్ విసిరాను. దానికి కూడా ఆయన నుంచి ఎలాంటి స్పందనా రాలేదు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.



లోయలో పడ్డ బస్సు.. 22 మంది కూలీలు మృతి


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 11: దేశంలో ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అతి వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అనుభవం లేకుండా క్లీనర్లు వాహనాలు నడపడం ఇలా ఎన్నో కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇండో చైనా సరిహద్దు వెంబడి ఉన్న హాయులియాంగ్ చగ్లగామ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. అస్సాంలోని టిన్సుకియా జిల్లాకు చెందిన రోజు వారి కూలీలను తీసుకువెళ్తున్న ఓ ట్రక్కు మార్గమధ్యలో ఈ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ఉన్న 22 మంది కూలీలు చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. వాస్తవానికి ఈ ఘటన సోమవారం అంటే మూడు రోజుల క్రితం జరిగింది. ఈ ప్రమాదం నుంచి ఓ కార్మికుడు గాయాలతో బయటపడి పట్టణానికి చేరుకున్నాడు. అతడు ఇచ్చిన సమాచారం వల్లనే ఈ విషాద ఘటన గురించి పోలీసులకు తెలిసింది. గాయపడ్డ ఆ కార్మికుడి మెరుగైన చికిత్స కోసం అస్సాంకు తరలించారు. ప్రమాద ఘటన గురించి అంజావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మిల్లో కొజిన్ ధృవీకరించారు. ఈ ప్రమాదంపై మాట్లాడుతూ.. ఈ ఘటన అంతర్జాతీయ సరిహద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి దాదాపు 10 వేల అడుగుల ఎత్తులో ఉందన్నారు. ఇప్పటి వరకు 17 మృతదేహాలను వెలికి తీసినట్లు తెలిపారు. రెస్క్యూ టీమ్ సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మిలో కొజిన్ వెల్లడించారు.






నిద్రలేమితో ఎన్నో సమస్యలు

ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్‌లో అర్ధరాత్రి వరకు మేల్కొనడం ఒక సాధారణ విషయం. పని ఒత్తిడి.. వినోద పద్ధతులు, సామాజిక కార్యకలాపాల కారణంగా చాలా మంది వారి నిద్రను నిర్లక్ష్యం చేస్తున్నారు. కానీ అది ఆరోగ్యానికి ఎన్ని సమస్యలను కలిగిస్తుందో తెలుసా? ఆఫీసు పని, పరీక్షలకు ప్రిపేర్ కావడం.. లేదా సోషల్, ఆన్‌లైన్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు అలవాటు పడినా తరచుగా అర్ధరాత్రి నిద్రను త్యాగం చేస్తుంటారు చాలా మంది. ఏదేమైనా, ఈ అలవాటు ఆరోగ్యానికి చాలా హానికరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. నిద్ర లేకపోవడం శారీరక ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాక, మానసిక సమస్యలను ఉత్పన్నం చేస్తుంది. అంతే కాకుండా మానసిక సమతుల్యతను కూడా పాడు చేస్తుంది. తీవ్రమైన నిద్రలేమి మిమ్మల్ని చాలా సమస్యలకు బాధితులుగా మారుస్తుంది.









బరువు పెరగడం

నిద్ర లేకపోవడానికి ఊబకాయానికి దగ్గరి సంబంధం ఉంది. తగినంత నిద్ర లేనప్పుడు, శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఉంటుంది. క్రమంగా హార్మోన్ స్థాయి పెరుగుతుంది, అయితే లెప్టిన్ స్థాయి తగ్గుతుంది. ఈ కారణంగా, మీరు మళ్లీ మళ్లీ ఆకలితో ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. ముఖ్యంగా తీపి అధిక కేలరీల ఆహారం తీసుకోవడానికి ఇష్టపడతారు. హార్మోన్ల అసమతుల్యత... తీపి, అధిక కేలరీల ఆహారం తీసుకోవడం వల్ల బరువు పెరగడం ఊబకాయం ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే, నిద్ర లేకపోవడం జీవక్రియను కూడా ప్రభావితం చేస్తుంది, ఇది బరువు తగ్గడాన్ని నిరోధిస్తుంది.

మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం

నిద్ర లేకపోవడం మీ మానసిక ఆరోగ్యాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది. తగినంత నిద్ర రాకపోవడం ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను పెంచుతుంది. నిద్ర పూర్తి కానప్పుడు, మెదడు సరిగ్గా పనిచేయలేకపోతుంది. దీనివల్ల మూడ్ స్వింగ్స్, చిరాకు మరియు కోపం వస్తుంది. ఎక్కువ కాలం నిద్ర లేకపోవడం కూడా తీవ్రమైన మానసిక రుగ్మతలకు కారణమవుతుంది.

రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది

మన శరీరంలోని రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో నిద్ర ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. తగినంత నిద్ర లేనప్పుడు, శరీరం యొక్క రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుంది. ఇది జలుబు, ఫ్లూ ఇతర ఇన్ఫెక్షన్ వంటి సమస్యలను తెస్తుంది. నిద్ర లేకపోవడం శరీరంలో మంటను పెంచుతుంది, ఇది గుండె జబ్బులు, డయాబెటిస్ క్యాన్సర్ వంటి అనేక తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుంది.

గుండె జబ్బుల ప్రమాదం

నిద్ర లేకపోవడం గుండె సమస్యలను కూడా కలిగిస్తుంది. నిద్ర సమయంలో, మన శరీరం తనను తాను రక్తపోటును నియంత్రించుకుంటుంది. నిద్ర పూర్తి కానప్పుడు, రక్తపోటు (బీపీ) పెరుగుతుంది. గుండెపై అదనపు ఒత్తిడి ఉంటుంది. ఇది హై బీపీ , గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. దీర్ఘకాలిక నిద్ర లోపం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా దెబ్బతింటాయి. ఇది గుండె జబ్బులను మరింత ప్రోత్సహిస్తుంది.

జ్ఞాపకశక్తి.. దృష్టి లోపం

మన మెదడుకు నిద్ర చాలా ముఖ్యం. ఇది మన జ్ఞాపక శక్తి, అభ్యాస సామర్థ్యం, ఏకాగ్రతను నిర్వహించడానికి సహాయపడుతుంది. నిద్ర లేకపోవడం మెదడు యొక్క పనితీరును ప్రభావితం చేస్తుంది, ఇది జ్ఞాపకశక్తిని బలహీనపరుస్తుంది, క్రొత్త విషయాలను నేర్చుకోవడంలో ఇబ్బంది కలిగిస్తుంది. అదనంగా, నిద్ర లేకపోవడం ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఇది రోజు రోజు కార్యకలాపాలలో తప్పులు చేసే అవకాశాలను పెంచుతుంది.

గమనిక: సలహా మరియు సూచనలు సాధారణ సమాచారం. ప్రజా ప్రయోజనం కోసం మాత్రమే. ఏదైనా ప్రశ్న లేదా ఇబ్బంది ఉంటే, ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.







ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

మొదలైన వరల్డ్ కప్ సందడి

వచ్చే ఏడాది జరుగబోయే పురుషుల టీ20 ప్రపంచకప్ టికెట్లు వచ్చేశాయి. నవంబర్ 25న పూర్తి షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ.. డిసెంబర్ 11న సాయంత్రం 6:45 నుంచి టికెట్లు అమ్మకాలను ప్రారంభించింది. అయితే.. కోహోస్ట్ అయిన భారత గడ్డపై వరల్డ్ కప్ తొలి టికెట్లను అనుకున్న సమయం కంటే ముందుగానే విడుదల చేశారు. భారత్, దక్షిణాఫ్రికా రెండో టీ20 మ్యాచ్ టాస్ పూర్తయ్యాక మైదానంలోనే ప్రపంచకప్ టికెట్లతో ఇరుజట్ల కెప్టెన్లు ఫొటోలు దిగారు. పొట్టి ప్రపంచకప్ ఆరంభం రోజే భారత్, యూఎస్ఏతో తలపడనుంది. సో.. ఈ మ్యాచ్ టికెట్‌ను కామెంటేటర్ రవి శాస్త్రి, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కలిసి విడుదల చేశారు. ఇద్దరూ నవ్వులు చిందిస్తూ ఆ టికెట్‌తో ఫొటో దిగారు. సఫారీ లెజెండ్ డేల్ స్టెయిన్, మర్క్‌రమ్ సైతం తమ జట్టు తొలి పోరు టికెట్‌తో మురిసిపోయారు. దక్షిణాఫ్రికా, కెనడా మ్యాచ్ టికెట్‌తో వీరిద్దరూ కెమెరాకు పోజిచ్చారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టి ప్రపంచకప్ ఫిబ్రవరి 7 టోర్నీ ప్రారంభం కానుంది. ఇరుదేశాల్లోని ఎనిమిది నగరాల్లో ఈ మెగా టోర్నీ మ్యాచ్‌లు జరుగనున్నాయి.



రెండో టీ20లో భారత్ ఓటమి

- డికాక్ మెరుపు ఇన్నింగ్స్
- సమష్టిగా విఫలమైన టీమ్ఇండియా

భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా తొలి పోరులో ఎదురైన ఓటమికి దక్షిణాఫ్రికా బదులు తీర్చుకుంది. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆ జట్టు 51 పరుగుల తేడాతో మెన్ ఇన్ బ్లూను ఓడించి జయభేరి మోగించింది. సౌతాఫ్రికా నిర్దేశించిన 214 పరుగుల రికార్డు ఛేదనలో టీమ్ఇండియా.. 19.1 ఓవర్లలో 162 రన్స్‌కే ఆలౌట్ అయింది. టాపార్డర్ విఫలమవగా తిలక్ వర్మ (34 బంతుల్లో 62, 2 ఫోర్లు, 5 సిక్సులు) పోరాడినా అతడికి అండగా నిలిచేవారు లేకపోవడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. క్వింటన్ డికాక్ (46 బంతుల్లో 90, 5 ఫోర్లు, 7 సిక్సులు) మెరుపు ఇన్నింగ్స్‌తో నిర్ణీత ఓవర్లలో 213/4 పరుగుల భారీ స్కోరుచేసింది. భారత పేసర్లు అర్ష్‌దీప్, బుమ్రా దారుణంగా విఫలమైనా వరుణ్ చక్రవర్తి (2/29) ఫర్వాలేదనిపించాడు. డికాక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఇరుజట్ల మధ్య మూడో టీ20 ఈనెల 14న ధర్మశాలలో జరుగుతుంది. ఇటీవలే పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన డికాక్.. టీ20ల్లో రెండు డకౌట్ల తర్వాత తన విలువను చాటే ఇన్నింగ్స్‌ను ఆడాడు. ఆరంభం నుంచే భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగిన డికాక్ క్రీజులో ఉన్నంతసేపు సఫారీ స్కోరు రాకెట్ వేగాన్ని తలపించింది. 11వ ఓవర్లో అర్ష్‌దీప్ ఏకంగా ఏడు వైడ్లు వేయడంతో పాటు మొత్తంగా 18 రన్స్ ఇచ్చాడు. మార్క్మ (29).. వరుణ్ 12వ ఓవర్లో రెండు సిక్సులు కొట్టినా ఆఖరి బంతికి అక్షర్ పటేల్‌కు క్యాచ్ ఇచ్చాడు. శతకం దిశగా సాగుతున్న డికాక్‌ను వరుణ్ తన ఆఖరి బోల్తా కొట్టించాడు. బ్రెవిస్ (10)ను అక్షర్ పెవిలియన్‌కు పంపినా ఆఖర్లో ఫెరీరా (16 బంతుల్లో 30*, 1 ఫోర్, 3 సిక్సులు) మిల్లర్ (12 బంతుల్లో 20*, 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి సఫారీలకు భారీ స్కోరు కట్టబెట్టారు. ఛేదనలో భారత టాపార్డర్ మరోసారి నిరాశపరిచింది. మొదటి 4 ఓవర్లలోనే మూడు కీలక వికెట్లను కోల్పోయి ఛేదనను మరింత కష్టతరం చేసుకుంది. గిల్ తానెదుర్కొన్న తొలి బంతికే డకౌట్ అవగా కెప్టెన్ సూర్య (5) చెత్త ఫామ్‌ను కొనసాగించాడు. రెండు సిక్సర్లు కొట్టిన అభిషేక్ (17)దీ అదేబాట! బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన అక్షర్ పటేల్ (21) సైతం ఆకట్టుకోలేకపోయాడు. 32 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన తిలక్.. ఆరంభంలో దూకుడుగా ఆడి 27 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తిచేశాడు. హార్దిక్ (21) వేగంగా ఆడలేకపోయినా జితేశ్ (27), తిలక్ పోరాడారు. అయితే ఆఖరి 3 ఓవర్లలో 72 రన్స్ కావాల్సి ఉండటంతో ఛేదన కష్టమేనని తేలిపోయింది. వేగంగా ఆడే క్రమంలో జితేశ్ నిష్క్రమించడంతో భారత ఓటమి ఖరారైంది.



హైదరాబాద్‌లో హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లు

హైదరాబాద్ మహానగరం మరో ప్రతిష్టాత్మక క్రీడాటోర్నీకి వేదిక కాబోతున్నది. వచ్చే ఏడాది మార్చిలో జరుగబోయే ఎఫ్ఐహెచ్ ఉమెన్స్ హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యమివ్వబోతున్నది. మార్చి 8 నుంచి 14దాకా ఈ టోర్నీ జరగాల్సి ఉంది. రెండో అంచెలో భాగంగా ఆతిథ్య భారత్‌తో పాటు ఇంగ్లండ్, స్కాట్లాండ్, కొరియా, ఇటలీ, ఉరుగ్వే, వేల్స్, ఆస్ట్రియా మ్యాచ్‌లు ఆడనున్నాయి. హైదరాబాద్ కంటే ముందే శాంటిగో (చిలీ)లో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 8 దాకా తొలి అంచె పోటీలు జరుగుతాయి.



మహిళా క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులు పెంపు

- కీలక నిర్ణయం తీసుకున్న బీసీసీఐ

ఇటీవల కాలంలో మహిళల క్రికెట్ అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. వన్డే ప్రపంచకప్ ఛాంపియన్‌గా అవతరించిన టీమిండియా క్రికెటర్లకు ప్రోత్సాహకంగా మ్యాచ్ ఫీజులను పెంచనుంది. డిసెంబర్ 22న జరుగనున్న సమావేశంలో మ్యాచ్ ఫీజుల సవరణ అంశం ప్రధానంగా చర్చకు రానుంది. ఈమధ్యే స్వదేశంలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు తొలిసారి విశ్వవిజేతగా నిలిచింది. మహిళా క్రికెట్ చరిత్రలో తొలి ఐసీసీ ట్రోఫీతో దేశం గర్వపడేలా చేసింది హర్మన్‌కౌర్ బృందం. దాంతో.. దేశవాళీలో మహిళా క్రికెటర్లకు వేతనాలు పెంచాలనే నిర్ణయానికొచ్చింది బీసీసీఐ. ప్రస్తుతం డొమెస్టిక్ మ్యాచ్‌లకు చెల్లిస్తున్న మ్యాచ్ ఫీజుల సవరణపై డిసెంబర్ 22న వర్చువల్‌గా జరిగే సమావేశంలో బీసీసీఐ ప్రతినిధులు చర్చించనున్నారు.

ప్రతిపక్షం
www.prathipaksham.in



'పెద్ది' ఫైనల్ టచ్

రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తున్నది. ఈ సినిమాకు సంబంధించి తాజా అప్‌డేట్ వెలువడింది. నేటి నుంచి హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభమవుతున్నది. ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. జనవరి నెలాఖరు వరకు జరిగే ఈ షెడ్యూల్‌తో టాకీ పార్ట్ మొత్తం పూర్తవుతుందని మేకర్స్ తెలిపారు. ఓ వైపు షూటింగ్‌తో పాటు పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాల్ని కూడా సమాంతరంగా నిర్వహిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్ అన్ని ఆటల్లో ప్రావీణ్యం కలిగిన ఆటకూలీ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించడంతో ఈ సినిమా కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. జాన్వీ కపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్. రెహమాన్, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, రచనదర్శకత్వం: బుచ్చిబాబు సానా.



శ్రీశైలంలో 'అఖండ2' టీమ్

తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం మహా క్షేత్రాన్నిఅఖండ2 తాండవం చిత్ర యూనిట్ దర్శించుకుంది. శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శకుడు బోయపాటి శ్రీను, సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ బృందం గురువారం దర్శించుకుంది. ఈ సందర్భంగా చిత్ర వీరికి రాజ గోపురం వద్ద ఆలయం మర్యాదలతో అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బోయపాటి, థమన్‌లు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి వేద ఆశీర్వచనం మండపం నందు అఖండ 2 యూనిట్‌కు వేద పండితులు వేద ఆశీర్వచనం తెలిపారు. అనంతరం స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను ప్రసాదాలను ఆలయ అధికారులు బోయపాటి, తమన్ బృందానికి అందించారు. దర్శనం పూర్తి చేసుకున్న తర్వాత ఆలయ ప్రాగణంలో డైరెక్టర్ బోయపాటి శ్రీను మీడియాతో మాట్లాడారు. 'విఘ్నాలన్ని తొలగిపోయి అఖండ 2 తాండవం సినిమా విడుదల కానున్న నేపథ్యంలో స్వామి అమ్మవార్ల దర్శనార్థం శ్రీశైలం వచ్చాం. ఆలయ అర్చకుల దీవెనలతో స్వామి దర్శనం చేసుకున్నాం. బాలయ్య ఉగ్రరూపాన్ని చూసేందుకు ఎదురుచూస్తున్న ప్రేక్షకులు అండఖ 2 సినిమాను థియేటర్లలో చూసి ఆనందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని బోయపాటి తెలిపారు. డిసెంబర్ 5న విడుదల కావాల్సిన అఖండ 2 తాండవం చిత్రం వారం ఆలస్యంగా.. డిసెంబర్ 12న థియేటర్లోకి వస్తున్న విషయం తెలిసిందే.



'అన్నగారు వస్తారు' రిలీజ్ వాయిదా

కోలీవుడ్ స్టార్ యాక్టర్ కార్తీ నటిస్తోన్న చిత్రం వా వాతియార్. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్నాడు. ఉప్పెన ఫేం కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం తెలుగులో అన్నగారు వస్తారు టైటిల్‌తో రిలీజ్ కానుంది. ఈ మూవీ డిసెంబర్ 12న విడుదల కావాల్సి ఉండగా.. ఊహించని విధంగా వాయిదా పడ్డది. తాజా అప్‌డేట్ ప్రకారం ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అన్నగారు వొస్తారు రేపు విడుదల కావడం లేదు. సినిమా నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు కోర్టు సినిమా రిలీజ్‌పై మధ్యంతర స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

90వ దశకంలో పోరాట యోధురాలిగా..

జయాపజయాలతో సంబంధం లేకుండా తెలుగులో భారీ అవకాశాలతో దూసుకుపోతున్నది మరాఠీ భామ భాగ్యశ్రీ బోర్సే. చూడముచ్చటైన అందం, చక్కటి అభినయంతో ఈ అమ్మడు యువతలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఇటీవలే ఈ సొగసరి 'ఆంధ్రకింగ్ తాలూకా' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది. తాజా సమాచారం ప్రకారం భాగ్యశ్రీ బోర్సే తొలిసారి మహిళా ప్రధాన చిత్రంలో నటించనున్నట్లు తెలిసింది. 90దశకం మద్యపాన నిషేధం నాటి రోజుల్లో జరిగే కథ ఇదని, ఇందులో సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడే ధీరోదాత్తురాలైన యువతిగా భాగ్యశ్రీ బోర్సే పాత్ర ఉంటుందని సమాచారం. స్వప్న సినిమాస్, వేణు ఊడుగుల సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని తెలిసింది. అయితే ఈ వార్తల్లో నిజమెంతుందో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200